ప్రజాశక్తి

గురువారం 16 జనవరి 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

'అన్నా..నీ వెంటే నేను..'

- మరణంలోనూ వీడని బంధం
- గుండెపోటుతో అన్న మృతి
- అన్న మరణవార్తను జీర్ణించుకోలేక తమ్ముడు హఠాన్మరణం
- ఇద్దరు కుమారుల మృతితో తల్లడిల్లిన తల్లి
- పండుగ పూట చీరాల, గొల్లపాలెంలో విషాదం



మృతిచెందిన గంగాధర్, గోపి

ప్రజాశక్తి-చీరాల

రక్త సంబంధాలతో పాటు మానవ సంబంధాలన్నీ మంట గలుస్తున్న ఈ రోజుల్లో తమ బంధాన్ని మరణం కూడా వేరుచేయలేదని నిరూపించారు అన్నదమ్ములు. తండ్రి గతంలోనే మరణించినా తనను కొడుకులా పెంచిన అన్న గుండెపోటుతో మరణించడంతో.. ఆ నిజాన్ని జీర్ణించుకోలేక తమ్ముడు కూడా హఠాన్మరనం చెందిన ఘటన అందరినీ కలిచివేసింది. పండుగ పూట అన్నదమ్ములిద్దరూ మృతిచెందడంతో చీరాల మండలం గొల్లపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కుటుంబసభ్యులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. చీరాల పట్టణంలోని 14వ వార్డు గొల్లపాలెంలో నివాసం ఉంటున్న బాలాజీ, పద్మ దంపతులకు ఇద్దరు కుమారులు గొల్లప్రోలు గంగాధర్ (40), గొల్లప్రోలు గోపి (34). బాలాజీ నాలుగేళ్ల క్రితం గుండెపోటుతో మృతిచెందాడు. పెద్దకొడుకు గంగాధర్ కొత్తపేట మూడు రోడ్ల సెంటర్లో వడ్రంగి పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. తమ్ముడు గోపిని బి.టెక్ వరకు చదివించాడు. ప్రస్తుతం తమ్ముడు గోపి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తూ.. పలు ప్రాంతాలలో శిక్షణ తీసుకుంటూ.. అన్నయ్యకు వడ్రంగి పనిలో సాయం చేస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా కుటుంబ సభ్యులతో అప్పటి వరకు సరదాగా గడిపిన అన్నయ్య గంగాధర్ కు గుండెనొప్పి రావడంతో వెంటనే బంధువుల సాయంతో తమ్ముడు గోపి పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అనంతరం చీరాల ఏరియా వైద్యశాలకు హుటాహుటిన తీసుకొచ్చారు. గంగాధర్ మృతిచెందినట్లు అక్కడి వైద్యులు ▶ 2లో

'వెలిగొండ'పై పాలకపక్షం మౌనం

- ప్రాజెక్టు పూర్తి కావాలంటే భారీగా నిధులు అవసరం..
- ప్యాకేజీల కోసం నిర్వాసితులూ ఎదురుచూపులు
- వెలిగొండ జలాల సాధన కోసం ఆందోళన చేపట్టిన సిపిఎం



వెలిగొండ ప్రాజెక్టును సందర్శిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

వెలిగొండ ప్రాజెక్టు మొదటి ప్రాధాన్యతగా ప్రకటించిన పాలకపక్ష నేతలు ఇప్పుడు దానిపై మౌనం దాల్చారు. రెండేళ్లు గడువుపెట్టి వదిలేశారు. జరగాల్సిన పనులు జరిగితే తప్ప పూర్తవడం కష్టమన్న భావన వ్యక్తమవుతోంది. ఎప్పటిలాగే తెలుగుదేశం సాగునీటి ప్రాజెక్టులపై అశ్రద్ధ చేస్తుందనే చర్చ కూడా ముందుకొచ్చింది. ఎందుకంటే చంద్రబాబు సిఎంగా 1996లో దీనికి శంకుస్థాపన చేశారు. ఆయన దాన్ని పదేళ్లు వదిలేశారు. 2014-19 కాలంలోనూ పెద్దగా చేసిందేమీ లేదు. వెలిగొండ ప్రాజెక్టుపై చంద్రబాబుకు అంతగా ఆసక్తి లేదనే చర్చ చాలా ఏళ్లుగా ఉంది. ఇప్పుడు దీన్ని చెరిపేసుకుంటారా? లేక కొనసాగిస్తారా? అన్నదీ చూడాలి.

వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయాలంటే ఇంకా రూ.నాలుగు వేల కోట్లకు పైగా నిధులు కేటాయించాలి. ఇప్పటివరకూ దీనికి రూ.6062 కోట్లు ఖర్చు పెట్టారు. దీని నిర్మాణ వ్యయం రూ.9700 కోట్లకు చేరింది. ఇంకా నాలుగు వేల కోట్లు కేటాయించాలి. రెండేళ్లలో పూర్తిచేస్తామని చెప్పిన మంత్రులు దీనికి ఏటా రూ.2 వేల కోట్లు ఇవ్వాలి. ఈ దిశగా చర్యలు కనిపించడం లేదు. ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు జిల్లా మంత్రులు, నేతలతో కలిసి ఇటీవల ప్రాజెక్టును సందర్శించారు. రెండేళ్లలో పూర్తిచేసి రైతులకు నీళ్లిస్తామని ప్రకటించారు. తర్వాత ఏమీ జరగలేదు. పనులు కూడా నత్తనడకన సాగుతున్నాయి. సిఎం చంద్రబాబు స్థాయిలో దీనిపై సమీక్ష చేయాలి. నిధులు కేటాయించాలి. ప్రస్తుతం సంక్షేమ పథకాలకే దిక్కు లేని పరిస్థితిలో సూపర్‌సిక్స్‌లో ఒక్కటే అమలులోకి వచ్చింది. ఈ తరుణంలో నిధుల కేటాయింపులపై ఇబ్బందుల రీత్యానే రెండేళ్ల గడువు పెట్టారని తెలుస్తోంది. అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రస్తావనకు రావడం లేదు. మంత్రివర్గ సమావేశాల్లోనూ ఇద్దరు మంత్రులున్నా చర్చకు తీసుకుపోయే సాహసం చేయలేకపోతున్నారు. నీళ్ల విడుదల కన్నా ముందు నిర్వాసితుల సమస్య తీర్చాలి. ఏపి అవసరాల కోసం ఎన్ని రూ.కోట్లు కావాలో ఇరిగేషన్ అధికారులు నివేదికలు తయారు చేశారు. ప్రధానంగా నిర్వాసితులు అక్కడ నుంచి బయటకు రావాలి. అందుకు రూ.1001.99 కోట్లు కావాలి. ఇందులో ప్యాకేజీల కోసం రూ.347.20 కోట్లు, పునరావాసం కోసం రూ.541.35 కోట్లు, ▶ 2లో

పండగంటే జూదమా.?

- సాంప్రదాయమైన సంక్రాంతి సంబరాలను మరిచిన అధికార పార్టీ నేతలు
- కోడిపందేలు, జూదాలకే అధిక ప్రాధాన్యత



క్రాప అడ్డరోడ్డు వద్ద కోడి పందేలు



పందెం బరుల వద్ద జూదం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

తెలుగు వారి సాంప్రదాయాలను ప్రతిబింబిస్తూ జరుపుకునే అతిపెద్ద పండుగ సంక్రాంతి.గతంలో ఎప్పుడయినా టిడిపి నేతలుగా ఉన్నవారు సాంప్రదాయాలను గౌరవిస్తూ పండుగ జరిపే వారు. ప్రధానంగా ముగ్గుల పోటీలు, పిండివంటలు, పాటలు, మ్యూజిక్‌చైర్స్, ఒంగోలు గిత్తల అందాల పోటీలు ఇలా పలురకాలుగా పోటీలు నిర్వహించి.. మూడు రోజుల పాటు సంక్రాంతి సంబరాలు చేసేవారు. కానీ ఈ సారి అధికారపార్టీ నేతలు సాంప్రదాయాల కన్నా జూదాలకే అధిక ప్రాధాన్యత ఇచ్చారు.

కూటమి నేతల నేతృత్వంలో జిల్లాలో ఎక్కడా భారీ స్థాయిలో సంక్రాంత్రి సంబరాలు జరిగిన దాఖలాలు లేవు. కానీ కోళ్లపందేల నుంచి కాయ్.. రాజా కాయ్ వరకు అన్ని చట్ట విరుద్ధమయిన కార్యకలాపాలు అధికారపార్టీ నేతృత్వంలో భారీ స్థాయిలో నిర్వహించారు. గతంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఉండి ప్రస్తుతం బాపట్ల జిల్లాలో చేరి ఉన్న రేపల్లె, బాపట్ల, వేమూరు నియోజకవర్గాల్లో ఈ సంక్రాంతికి జోరుగా కోడిపందేలు, పేకాట, గుండాట, రికార్డింగ్ డాన్సులతో పందెం రాయుళ్లు చేసిన సందడి 'తగ్గేదేలె' అన్నట్లుగా ఉంది. భోగి ముందు రోజు నుంచి కనుమ వరకు నాలుగు రోజుల పాటు అధికారం అండగా మూడు నియోజకవర్గాల్లో పెద్ద బరుల్లో జరిగిన కోళ్ళపందేలు.. సంక్రాంతి అంటే జూదమే.! అన్నట్లుగా సాగాయి.

రేపల్లే నియోజకవర్గం తూర్పు పాలెంలో ఏర్పాటుచేసిన అతి పెద్ద బరుల్లో భారీ ఎత్తున కోళ్ళపందాలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగిన కోళ్ళపందేల్లో రెండు రోజులు ఐదు పోటీల్లో గెలిచిన పందెం కోళ్ళ జట్టుకు రెండు బైక్‌లను బహుమతిగా ఇచ్చారు.

బాపట్ల నియోజకవర్గం మంతెనవారి పాలెం వద్ద రాజుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన పెద్దబరిలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో మూడు రోజుల పాటు కోళ్ళపందేలు జరిగాయి. నియోజకవర్గానికి చెందిన చిన్న నేతకు చెందిన 27 పందెం కోళ్లు పోటీలోకి దిగాయి. మొదటి రోజు జరిగిన 9 పోటీల్లో ఐదు పోటీల్లో గెలిచిన బాపట్ల చెందిన యస్‌యస్ పందెంకోళ్ల జట్టు బైక్‌ను గెలుచుకోగా, సంక్రాంతి, కనుమ రోజు జరిగిన పోటీలో రాజుల జట్టుకు చెందిన పందెం కోళ్లు వరుసగా ఐదు, ఆరు సార్లు గెలిచి రెండు బైక్‌లను గెలుచుకున్నారు. చిన్ననేతకు చెందిన 16 పందెం కోళ్ళు విజయం సాధించినట్లు చెబుతున్నారు. వేమూరు నియోజకవర్గంలో క్రాప అడ్డరోడ్డు వద్ద, అనంతవరంలో టిడిపి నేతల నేతృత్వంలో మొత్తం 8 కోళ్ళపందాల బరులు నిర్వహించారు. ఇక్కడ కూడా కోళ్ళ పందాల్లో విజేతలకు బైక్‌లను బహుమతిగా ఇచ్చారు. ఈ బరుల వద్ద జూదం ఆడేందు కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. చట్టవిరుద్దమయిన అన్ని ఆటలూ సాగాయి. మద్యం అమ్మకాలు కూడా అక్రమంగా జరిపారు. మూడు నియోజకవర్గాల్లో రూ.కోట్ల రూపాయలు చేతులు మారాయి.

పండుగకు రెండు రోజుల ముందు వరకు హడావుడి చేసి చిన్నచిన్న పందెం జూదరులను, పందెం కోళ్ళను పట్టుకున్న పోలీసులు ఆ తరువాత మౌనం దాల్చారు. నాలుగు రోజుల పాటు జరిగిన కోళ్లపందేలు, జూదాలు చివరి రోజు రికార్డింగ్ డాన్సులతో ముగిశాయి.

పండగలన్నీ వ్యాపారమయం

- వ్యవసాయం అభివృద్ధి చెందితేనే గ్రామాభివృద్ధి
- ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

పండగలన్నీ ప్రస్తుతం వ్యాపారమైపోయాయని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. మండలంలోని మంగమూరులో సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా పలు ఆటలు పోటీలను నిర్వహించారు. విజేతలకు బహుమతి ప్రదానం సందర్భంగా జరిగిన సభలో రమాదేవి ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పంటలు ఇంటికొచ్చే సమయంలో వచ్చే పండుగ సంక్రాంతి పండుగ అని అన్నారు. సంక్రాంతి పండగ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో వేర్వేరు పేర్లతో జరుపుకుంటున్నారని తెలిపారు. రానూరానూ కాలం మారిపోయిందని, ఉత్సాహంగా జరుపుకునే పండుగల స్థానంలో కోడి పందేలు, జూదాలు, బెట్టింగులు వచ్చాయని తెలిపారు. పిల్లలు ఏడుస్తున్నారని ఫోన్లను మనమే ఇస్తున్నామని, టీవీలను మనమే అలవాటు ▶ 2లో



విజేత జట్టుకు సంక్రాంతి కప్ అందజేస్తున్న రఘుబాబు

అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు గర్వకారణం

4లో

'అన్నా.. నీ వెంటే నేను..'

(మొదటిపేజీ తరువాయి)

నిర్ధారించారు. ఈ విషయం గోపికి చెప్పారు. అన్న మృతిచెందాడన్న వార్తను గోపి జీర్ణించుకోలేక గంగాధర్ మృతదేహం వద్దే కుప్పకూలి.. నిమిషాల వ్యవధిలోనే మృతిచెందాడు. వైద్యులు గోపీని బతికించేందుకు ఎంత ప్రయత్నం చేసినప్పటికీ గోపి శరీరం సహకరించలేదు. అసలు అక్కడ ఏం జరుగుతుందో వైద్యులకే కాసేపు అర్థం కాని పరిస్థితి తలెత్తింది. అన్నదమ్ములిద్దరూ వెంటవెంటనే మృతిచెందడం స్థానికులనూ కలిచివేసింది. ఘటనపై అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలను నమోదు చేసుకున్నారు. రెండో పట్టణ సీఐ భూషణం ఏరియా వైద్యశాలకు చేరుకొని మృతదేహాలను పరిశీలించి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. గంగాధర్‌కు భార్య, కుమార్తె ఉన్నారు. గోపీకి ఇంకా వివాహం కాలేదు. కుటుంబానికి జీవనాధారంగా ఉన్న ఇద్దరు కుమారులనూ కోల్పోవడంతో తల్లి పద్మ తల్లడిల్లిపోయారు. అన్నదమ్ముల మృతితో గొల్లపాలెంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

'వెలిగొండ'పై పాలకపక్షం మౌనం

(మొదటిపేజీ తరువాయి)

కాలనీల్లో సౌకర్యాల కోసం రూ.113.44 కోట్లు అవసరం. ఈ నిధులు తక్షణం కేటాయించాలి. ఆరు నెలలు గడిచినా పట్టించుకోలేదు. ప్రభుత్వం మారగానే నిధులు వస్తాయని ఆశపడ్డారు. ఎందుకంటే పశ్చిమప్రాంతంలో జరిగిన ఎన్నికల సభల్లో చంద్రబాబు పదేపదే నిర్వాసితులకు న్యాయం చేస్తామని ప్రకటించారు. ప్రస్తుత ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూడా ఎన్నికలకు ముందు వెలిగొండ ప్రాజెక్టు కోసం అంటూ ఊరూరా పాదయాత్ర చేపట్టారు. ఇప్పుడు అందరూ మౌనం దాల్చారు. రోజువారీ చర్చల్లో వెలిగొండ ఊసే వినిపించడం లేదు. తెలివిగా రెండేళ్లు గడువు పెట్టి పక్కనపెట్టేశారనే చర్చ సాగుతోంది. గత వైసిపి ప్రభుత్వంలో కూడా దీన్ని పూర్తిచేయకుండానే ప్రారంభం చేశారు. వాళ్లను ఇదొక తప్పిదంగా వెంటాడుతోంది. వెలిగొండపై వైసిపి నేతలు కూడా ఏమీ మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారు. ఇక వెలిగొండ జలాల సాధన కోసం సిపిఎం ఆందోళన చేపట్టింది. ఇటీవలే ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావులు ప్రాజెక్టును సందర్శించారు. ప్రాజెక్టును వెంటనే పూర్తిచేసి రైతులకు నీళ్లివ్వాలని డిమాండ్ చేశారు. అందులో భాగంగానే ఈ నెల 23న కనిగిరిలో వెలిగొండ జలాల సాధన కోసం సదస్సు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సదస్సుకు సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ.రాఘవులు హాజరుకానున్నారు.

పండగలన్నీ వ్యాపారమయం

(మొదటిపేజీ తరువాయి)


చేస్తున్నావని చెప్పారు. వ్యవసాయం అభివద్ధి చెందితేనే గ్రామాలు అభివద్ధి చెందుతాయన్నారు. పిల్లల చదువులకు లక్షలాది రూపాయలు వెచ్చిస్తున్నారని తెలిపారు. నేటితరం పిల్లల్లో మానవ సంబంధాలు తగ్గిపోతున్నాయన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటపాటల్లోనూ ప్రవేశం ఉన్నప్పుడే వారిలో మానసిక వికాసం కలుగుతుందని తెలిపారు. కార్పొరేట్ విద్య వల్ల విద్యార్థుల మెదళ్లను యంత్రాలుగా మారుస్తున్నారని తెలిపారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, క్లాత్ గేమ్, బైక్ స్లో, లెమన్ స్పూన్ తదితర పోటీల విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం బాల బాలికలచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సంధర్భంగా జరిగిన సభకు ఐద్వా మండల అధ్యక్షురాలు బంకా పద్మ అధ్యక్షత వహించారు. సభలో ఐద్వా నాయకులు ఎస్కే నాగూర్‌బీ, అబ్బూరి బసవమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు, విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు షేక్ మస్తాన్, మంచికలపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి ఆటలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్టలో సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా జనవిజ్ఞాన వేదిక, డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు ఆధ్వర్యంలో మ్యూజికల్ చైర్స్, గిరిలో కుండ కొట్టుట, లెమన్ స్పూన్, చెరువు గట్టు, తాడులాగుట, ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు జన విజ్ఞాన వేదిక గ్రామ అధ్యక్షులు షేక్ అంజయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో జన వేదిక జిల్లా నాయకులు కె సుబ్రమణ్యాచారి పాల్గొని మాట్లాడుతూ ఐక్యత కొరకు–ఆటలు యువజన మైత్రికి బాటలు నినాదంతో అందరికీ వేదిక ఏర్పాటు చేసి ఉత్సాహంగా ఆటలు సాంస్కృతిక కార్యక్రమాలు ముగ్గుల పోటీలను నిర్వహించినట్లు తెలిపారు. యువత వ్యసనాలకు లోను కాకుండా విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ ఆలోచనా విధానం వైపు ఆలోచించాలని, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని కోరారు. సభలో మాదాల వెంకయ్య శాంతమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మాదాల లక్ష్మీనారాయణ, గ్రామపెద్దలు కరిచేటి శ్రీనివాసరావు జన విజ్ఞాన వేదిక నాయకులు యు భాస్కర్, వి వెంకటేశ్వరరెడ్డి, రైతు సంఘం నాయకులు అన్నం వెంకట సుబ్బారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బంకా సుబ్బారావు నాయకులు టి సుబ్బారావు, డి చిన్నబాబు, బివి రమణారావు, యు రామకృష్ణ, పి చిన్నశేషయ్య, జె వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కొండపి: ఐక్యత కొరకు ఆటలు యువజన మైత్రికి బాటలు అని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కెజి మస్తాన్ అన్నారు. కొండపిలోని నూతన సచివాయం వద్ద డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, మహిళ సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సంక్రాంతి ఆటల పోటీలు నిర్వహించారు. అదే విధంగా కొండపి మండలంలోని పెరిదేపి గ్రామంలో కూడా రెండు రోజుల నుంచి పిల్లలకు, పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, బంతిఆట, ఉండమ్మా బొట్టుపెడతా, పాటల పోటీలు, కబడ్డీ వంటి పోటీలు



సంతనూతలపాడులో మాట్లాడుతున్న జేవీవీ జిల్లా నాయకులు సుబ్రమణ్యాచారి

నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మహిళలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. బంధుమిత్రులంతా ఒకే చోట కలిసి ఆనందంగా కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కెజి మస్తాన్ మాట్లాడారు. అనంతరం వివిధ పోటీలలో విజేతలకు ప్రసన్నాంజనేయ ట్రస్టు వారు బహుమతులు అందజేశారు. ఈ విధంగా గత 24 సంవత్సరాల నుంచి గెలుపొందిన వారికి బహుమతులు అందచేస్తున్నట్లు నిర్వహణ కమిటీ వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకుడు సిహెచ్ వినోద్, నాయకులు వై లక్ష్మయ్య, వై రూబెన్, జి వందనం, మల్లెల చినపేతురు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తి: సిఐటియు డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మండలంలోని నిప్పట్లపాడులో ఆటల పోటీలు నిర్వహించారు. క్రికెట్, పరుగు పందెం, కుర్చీలాట, లెమన్ స్పూన్ ఆటలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో జెవివి జిల్లా నాయకులు నల్లూరి వెంకటేశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు మాట్లాడారు. క్రీడలు ఐక్యతకు, ఆత్మస్థైర్యానికి తోడ్పడతాయని అన్నారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నుగ్గు శ్రీను, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు శీలం ఆది నారాయణ, నాయకులు పువ్వా లక్ష్మయ్య ఎం ప్రసాద్, డివైఎఫ్ఐ నాయకులు ప్రేమ్‌కుమార్, రాము, రిటైర్డ్ ఉపాధ్యాయులు ముప్పా మాలకొండ రాయుడు పాల్గొన్నారు.



కొండపిలో ముగ్గులు వేస్తున్న మహిళలు

నాగులుప్పలపాడు: మండలంలోని ఉప్పుగుండూరులో కాకతీయ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి క్రీడలు మంగళవారం రసవత్తరంగా సాగాయి. ట్రాక్టరు రివర్స్, తాడులాగుట తదితర పోటీలు నిర్వహించారు. ట్రాక్టరు రివర్స్ పోటీల్లో 47 సెకన్లలో పూర్తి చేసిన బండారుపల్లి శ్రీనివాసరావుకు మొదటి బహుమతి, 53 సెకన్లలో పూర్తి చేసిన పురిణి బాలచంద్రకు రెండో బహుమతి, 56 సెకన్లలో పూర్తి చేసిన సందిపోగు రమేష్‌కు మూడో బహుమతి లభించాయి. తాడులాగుటలో యలమంచి సాయి టీం, మొదటి స్థానం, మక్కెన సాయిప్రదీప్ టీం రెండో స్థానం, గోగినేని చంద్రశేఖర్ టీం మూడో స్థానం సాధించాయి. ఈ పోటీలను వివిధ గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకించారు. గెలుపొందిన వారికి 18వ తేదీన ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా జరిగే సభలో అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

శింగరాయకొండ: శింగరాయకొండ మండలం శానంపూడి గ్రామంలోని అంబేద్కర్ నగర్ కాలనీలో గత ముప్పై సంవత్సరాలుగా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో ఈ సంవత్సరం సంక్రాంతి సందర్భంగా కూడా చిన్నారుల మానసిక ఉల్లాసానికి ఆటల పోటీలు, సామాజిక స్పృహతో కూడిన నాటికలు, నృత్యాలు, సంఘ ఐక్యతకు మహిళలకు ముగ్గుల పోటీలు, తాడు లాగుట, లెమన్ స్పూన్ లాంటి ఆటలతో ఆనంద వాతావరణం నెలకొంది. అంబేద్కర్ యువజన సభ్యులు ఏకతాటిపై ఉండి ఈ కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంవత్సరంలో ఎన్ని పండుగలు వచ్చినా తమ గ్రామంలో సంక్రాంతి పండుగకు ప్రత్యేక స్థానం ఉంటుందన్నారు. ముట్టేరు, మన్నేరు రెండు ఏరుల కలయిక పక్కనే శ్మశాన వాటికతో దక్షిణ కాశీగా పేరొందిన శివాలయం తమ ఊరి ప్రత్యేకతని, కుల మతాలకతీతంగా గ్రామంలోని ప్రజలందరూ శివాలయం దగ్గర ఒకసారి కలుసుకుంటారని తెలియజేశారు.



చీమకుర్తిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సిఐటియు, డివైఎఫ్ఐ, జెవివి నాయకులు




శింగరాయకొండలో ఆటల్లో పాల్గొన్న చిన్నారులు

ఎవరికీ పట్టని 'శీతల గిడ్డంగి'

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ప్రాంత రైతన్నలకు శీతల గిడ్డంగి (కోల్డ్ స్టోరేజీ) అందుబాటులో లేదు. ఇక్కడి రైతన్నలు మిర్చి పంటను అధికంగా సాగు చేస్తారు. మిర్చి దిగుబడులను నిల్వ చేసుకునేందుకు ఇక్కడ శీతల గిడ్డంగి అవసరం. ఎప్పటి నుంచో రైతన్నలు దాని కోసం ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు శీతల గిడ్డంగి మంజూరయింది. దాని నిర్మాణం మొదలై మధ్యలో ఆగిపోయింది. శీతల గిడ్డంగి నిర్మాణం ఎవరికీ పట్టలేదని రైతన్నలు ఆవేదనలో ఉన్నారు. స్థానికంగా శీతల గిడ్డంగి అందుబాటులో లేని ఫలితంగా ప్రయివేటు శీతల గిడ్డంగుల్లో అధిక మొత్తంలో అద్దెలు చెల్లిస్తూ నెలల తరబడి నిల్వ చేసుకోక తప్పడం లేదు. ఈ ఇబ్బందుల నుంచి రైతులను గట్టెంక్కించేందుకు 2018లో టిడిపి ప్రభుత్వం మార్కాపురం వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రూ.5 కోట్ల వ్యయంతో శీతల గిడ్డంగి మంజూరు చేసింది. అప్పట్లో ఎన్నికల ముందు మంత్రిగా ఉన్న నారా లోకేష్ 2018 నవంబర్ 29వ తేదీన శంకుస్థాపన చేశారు. నిర్మాణ పనులు మొదలయ్యాయి. 2019లో ఎన్నికల్లో టిడిపి అధికారాన్ని కోల్పోయింది. కొత్తగా అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం 25 శాతం లోపల జరిగిన పనులన్నీ నిలిపివేయాలని ఉత్తర్వులు ఇచ్చింది. అందులో మార్కాపురంలోని శీతల గిడ్డంగి కూడా ఉంది. దీంతో పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. ఇక్కడ శీతల గిడ్డంగిని మంజూరు చేసిన టిడిపి మరోమారు అధికారంలోకి వచ్చింది.



నిలిచిన కోల్డ్ స్టోరేజీ భవన నిర్మాణం

ప్రస్తుత సిఎం చంద్రబాబు అప్పట్లో ఈ గిడ్డంగిని మంజూరు చేశారు. దీనికి శంకుస్థాపన చేసిన నారా లోకేష్ కూడా మంత్రిగా కొనసాగుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటింది. నేటికీ ఇక్కడి కోల్డ్ స్టోరేజీపై ఎలాంటి స్పష్టత లేదని తెలిసింది. అప్పట్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు కూడా చెల్లించలేదని తెలిసింది. స్థానిక ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దీనిపై దృష్టి సారించాలని పలువురు రైతన్నలు కోరుతున్నారు. ఇక్కడ శీతల గిడ్డంగి అందుబాటులో ఉంటే వేలాది మంది రైతులకు నిల్వ చేసుకునే అవకాశం దక్కుతుంది. ఇదే లేకపోతే గుంటూరు వంటి సుదూర ప్రాంతాల్లో రవాణా ఖర్చులతో పాటు అద్దెలు భరిస్తూ నిల్వ చేసుకోవాల్సి వస్తుంది. సంబంధిత అధికారులు కూడా నిలిచిన శీతల గిడ్డంగి నిర్మాణ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళితే ఇక్కడి రైతాంగానికి ప్రయోజనం కలిగించిన వారవుతారు.

ఐక్యత కోసం ఆటల పోటీలు

ప్రజాశక్తి - రేపల్లె

సంక్రాంతి పండుగ సందర్భంగా రేపల్లె పట్టణం నేతాజీ కాలనీలోని 24వార్డు ఎన్‌టిఆర్ స్కూల్ వద్ద ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు కోలసాని రాము ఆర్థిక సాయంతో బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ ప్రజలు మధ్య ఐక్యతకు ముగ్గులు, ఆటల పోటీలు దోహదపడతాయని తెలిపారు. విజేతలకు ఐద్వా నాయకురాలు హేమ నాగశ్రీ, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు కెవి.లక్ష్మణరావు, వై. నవీన్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతిని సాధించిన పి. అప్పాన రూ.1516, ద్వితీయ బహుమతి సాధించిన వి.నాగమల్లేశ్వరికి రూ.1116, మూడో బహుమతి సాధించిన వి.రజనీకి రూ.516 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, డివైఎఫ్ఐ నేతలు కెవి. లక్ష్మణరావు, వై.నవీన్, ఐ.లీల కోటేశ్వరరావు,కె.ఆశీర్వాదం, జె.ధర్మరాజు,వాసు తదితరులు పాల్గొన్నారు.


చీరాల : నేటి యువత రోజంతా సెల్ ఫోన్లతోనే గడుపుతూ కుటుంబ సభ్యుల పలకరింపులకు దూరం అవుతున్నారని డివైఎఫ్ఐ కార్యదర్శి భగవాన్ దాస్ తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణంలోని వైకుంఠపురం గాంధీనగర్‌లో డివైఎఫ్ఐ సిఐటియు ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ముగ్గులు, స్లోసైకిలింగ్, మ్యూజికల్ చైర్స్ తదితర పోటీల బుధవారం నిర్వహించారు. సందర్భంగా పలువురు మాట్లాడుతూ యువత అందరూ మంచి స్ఫూర్తితో ముందుకు సాగాలని సెల్ ఫోన్ లను సెలవు దినాలలోనైన విడిచి కుటుంబ సభ్యులతో బంధువులతో ప్రేమ ఆప్యాయలతో మనసులోని భావాలను పంచుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. తొలుత ఈ పోటీలకు సిఐటియు కార్యదర్శి ఎం.వసంతరావు ప్రారంభించారు. న్యాయ నిర్ణయత లుగా సుభాషిణి, పావని, సుజాత వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షుడు ఎన్.బాబూరావు, బి. సుబ్బారావు, డివైఎఫ్ఐ నాయకులు పి.సాయిరాం,కిరణ్,బెజ్జం మణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పంగులూరులో కుర్చీలాటలో పాల్గొన్న చిన్నారులు

వాడరేవులో..

సంక్రాంతి పండుగ సందర్భంగా వాడరేవు బిల్డింగ్ సెంటర్ బొంది అప్పారావు వీధిలో డివైఎఫ్ఐ, సిఐటియు, ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఈపురిపాలెం ఎస్ఐ చంద్రశేఖరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ యువత ఉన్నత విద్యను కొనసాగిస్తూ చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా మంచి లక్ష్యంతో



రేపల్లెలో బహుమతులు అందజేస్తున్న నాయకులు

ముందుకు సాగి అన్ని రంగాలలో రాణించాలి అన్నారు. న్యాయ నిర్ణయితగా సుభాషిణి వ్యవహించారు. విజేతలకు ఎస్ఐ చంద్రశేఖర్ చేతుల మీదుగా బహుముతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఎరిపిల్లి రమణ, ధోని,కనకరాజు డివైఎఫ్ఐ నాయకులు గంగిరి ఏసుబాబు,సిహెచ్.కోటేశ్వరరావు, బొంది గురునాధం, జి.రాజబాబు, బి.రాము, బి.తాతారావు పాల్గొన్నారు.

యద్దనపూడి: మండల ప్రజలు సంక్రాతి పండుగను ఆనందంగా జరుపుకున్నారు. ఇతర రాష్ట్రలు, ఇతర పట్టణాల నుంచి వచ్చిన వారితో గ్రామాల్లో సందడి నెలకొంది. ముగ్గుల పోటీలు, గాలి పటాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. వింజనంపాడు గ్రామములో నిర్వహించిన ముగ్గుల పోటీల విజేతలుకు యద్దనపూడి ఎస్ఐ రత్నకుమారి బహుమతులు అందించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో న్రాయకులు సాధినేని రంగారావు, సుధీర్, పెడవల్లి వెంకటరావు,మండవ నరేంద్ర, గుత్తా వాసు, వేణు, రామకష్ణ, సాంబయ్య, నాగేశ్వరరావు, సీతయ్య, వెంకట స్వామి తదితరులు పాల్గొన్నారు.

పంగులూరు : మండల పరిధిలోని రేణింగవరం గ్రామంలో టిడిపి నాయకుడు బోరెడ్డి ఓబుల్ రెడ్డి ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించారు. ముగ్గుల పోటీలో అంబటి ప్రసన్న ,బోరెడ్డి లక్ష్మి, పత్తిపాటి జ్యోతిలక్ష్మి ప్రథమ ,ద్వితీయ, తతీయ స్థానాలు సాధించారు. కబడ్డీ పోటీలో సీనియర్స్ విభాగంలో గానుగ చెట్టు బ్యాచ్, జూనియర్స్ విభాగంలో 7 టైగర్స్ జట్లు బహుమతులు సాధించారు. ట్రాక్టర్ రేసింగ్ లో భూమా శ్రీనివాస్ రెడ్డి, పత్తిపాటి నరసింహారావు ,భూమా బాల నాగిరెడ్డి బహుమతులు సాధించారు. క్రికెట్ పోటీలో జూనియర్స్ విభాగంలో స్టడీ టీం, సీనియర్స్ విభాగంలో డాకు స్క్వాడ్, వాలీబాల్ పోటీలో స్పైక్ స్టార్ జట్లు సాధించినట్లు ఓబుల్ రెడ్డి తెలిపారు.

బాపట్ల : సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళ, బుధవారాల్లో బాపట్ల పట్టణ ఉప్పరపాలెం, వెదుళ్ళపల్లి గ్రామాల్లో ముగ్గులు, మ్యూజికల్ చైర్, వాలీబాల్, లెమన్ అండ్ స్పూన్ పోటీలు నిర్వహించారు. సిఐటియు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారంబహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి, కష్ణమోహన్, సుభాషిణి, తిరుమలరెడ్డి, నూతలపాటి కోటేశ్వరరావు, వై. భాస్కరరావు, కె. మోహనరావు, కె. శరత్, రాహేలు, కోటేశ్వరి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

మేదరమెట్ల : మేదరమెట్ల ,రావినూతల, బీసీ కాలనీలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం ముగ్గుల పోటీలు, కుర్చీల ఆట పోటీలు తదితర పోటీలు నిర్వమించారు. రావినూతలలో రావినూతల విజ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో కథ చెబుతాను ఊకొడతారా.. అనే కార్యక్రమాన్ని పిల్లలకు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా బాధ్యులు ఎం.ఆంజనేయులు, బి.దశరథ రామారావు, వై.రవీంద్రబాబు, ఎం.సత్యమూర్తి ,వైకుంఠం అన్నపూర్ణ, వీరాంజనేయులు పాల్గొన్నారు.

అద్దంకి : మండల ప్రజలు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు , ఎడ్ల పందేలు నిర్వహించారు. పాడిపశువులను సుందరంగా అలంకరించారు. సంక్రాంతి పండుగకు దేశ నలుమూలల నుంచి ప్రజలు తమ స్వగ్రామాలకు చేరుకోవడంతో పండుగ నిండుదనంగా కనిపించింది.

ఇంకొల్లు : సంక్రాంతి సంబరాల్లో భాగంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లో గత మూడు రోజులుగా వివిధ సాంస్కతిక నిర్వహించారు. గంగవరంలో ఆంజనేయ స్వామి విగ్రహంవద్ద కామ్రేడ్ మంచలా రవి జ్ఞాపకార్థం



యద్దనపూడిలో విజేతలకు బహుమతులు అందజేస్తున్న నాయకులు

మంగళవారం, బుధవారల్లో నాటికలు ప్రదర్శించారు .ఎస్‌వికెఉన్నత పాఠశాల విద్యార్థులు, సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇంకొల్లులోని ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. విజేతలకు అరుణోదయాసిస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎమ్‌డి మాగులూరి సాంబయ్య బహుమతులు అందజేశారు.



రేపల్లెలో బహుమతులు అందజేస్తున్న నాయకులు

ఇంకొల్లు ఇస్లాంపేట, శాంతినికేతన్ వీధిలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. నాగండ్ల, పూసపాడు, ఇడుపుల పాడు, రుద్దుకూరు, కొనికి భీమవరం గ్రామాలలోనూ ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి ఉత్సవాలలో భాగంగా కనుమ రోజు గ్రామ చెక్కభజన కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నాగుల చెరువు కట్ట వద్ద బందావన చెక్కభజనను నిర్వహించారు. ఈ చెక్కభజన ప్రదర్శన శ్రోతలను ఆలరించింది.చీమకుర్తికి చెందిన మహిళా భజన మాస్టర్ సుజాత గత నెల రోజులుగా ఇంకొల్లులో బాలికలకు ఈ చెక్కభజన సంబంధించిన శిక్షణ ఇచ్చారు.

చెరువులో పడి ఇద్దరు యువకులు మృతి

ప్రజాశక్తి-కొత్తపట్నం

ప్రమాద వశాత్తు చెరువులో పడిన ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ఘటన మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో చోటు చేసుకుంది.అందిన వివరాల ప్రకారం...అల్లూరు గ్రామానికి చెందిన మిట్నసల ఆదిత్య(20), కొల్లాబత్తిన గిరి(20) ఇంజినీరింగ్ చదువుతున్నారు. ఇద్దరు కలిసి మంగళవారం ఉదయం బహిర్భూమి కోసం గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. ఈక్రమంలో కొల్లా బత్తినగిరి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయాడు. గిరిని కాపాడేందుకు ఆదిత్య కూడా చెరువులోకి దిగాడు. ఇద్దరికి ఈత రాక పోవడంతో నీట ముగిని ఊపిరి ఆడక చనిపోయారు. కొత్తపట్నం ఎస్ఐ వి. సుధాకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - రేపల్లె : మండలపరిధిలోని పేటేరు గ్రామ శివారులో పేకాట శిబిరంలో దాడులు నిర్వహించి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.1100 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. నిందితులను కోర్టులో హాజరు పరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడులో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంతమాగులూరు : మండల పరిధిలోని చవిటిపాలెం గ్రామ శివారులో నిర్వహిస్తున్న కోడి పందేల శిబిరంపై దాడులు నిర్వహించి ఐదు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ పట్టాభిరామయ్య తెలిపారు.వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రూ.3,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అంత్యక్రియల్లో పాల్గొన్న పోలీసు అధికారులు

డిఎస్‌పి రత్తయ్యకు అంత్యక్రియలు

ప్రజాశక్తి -యద్దనపూడి

గుంటూరు జిల్లా అమవరాతిలోని డిజిపి కార్యాలయంలో డిఎస్‌పిగా పనిచేస్తున్న యద్దనపూడి మండలం సూరవరపల్లె గ్రామానికి మద్దలూరి రత్తయ్య అనారోగ్యం బాధపడుతూ గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఆయన మృతదేహాన్ని స్వగ్రామైన సూరవరపల్లె మంగళవారం తీసుకొచ్చారు. పోలీసు లాంఛనాలతో బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. తొలుత చీరాల డిఎస్‌పి మహ్మద్ మోహిద్దీన్, యద్దనపూడి ఎస్ఐ రత్నకుమారి, పోలీసు సిబ్బంది, స్నేహితులు, బంధువులు, గ్రామస్తులు, వివిధ పార్టీల నాయకులు రత్తయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు.

గ్రామాల్లో కోడిపందేలు

ప్రజాశక్తి-కొల్లూరు

సంక్రాంతి పండుగ సందర్భంగా మూడో రోజు బుధవారమూ కొల్లూరు, అనంతవరం గ్రామాల్లో కోడిపందేలు నిర్వహించారు. ఈ పందేలను చూడడానికి చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో విచ్చేశారు. మహిళలు కూడా పెద్ద సంఖ్యలో రావడం విశేషం. పెద్ద బరులలో రూ.20 వేలు, చిన్న బరులలో రూ.5 నుంచి రూ.10 వేల మేర పందేలు కాశారు. మూడు రోజుల్లో లక్షల్లో పందాలు జరిగినట్లు సమాచారం అదేవిధంగా పేకాట, గుండాట, కాయ్` రాజా కాయ్ లాంటి జూదాలు కూడా నిర్వహించారు.



చీరాలో స్లోసైకింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



మేదరమెట్లలో కుర్చీలాటలో పాల్గొన్న విద్యార్థులు



వాడరేవులో బహుముతులు అందజేస్తున్న నాయకులు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి- భట్టిప్రోలు

చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 24న చీరాలలోని చేనేత జౌలిశాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు ఎపి చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి మునుగుడి సత్యనారాయణ తెలిపారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు దీపాల సత్యనారాయణ, మండల కమిటీ సభ్యులు బట్టు నాగమల్లేశ్వరరావు, ఆకురాతి శ్రీనివాసరావ , ఎస్. గోపాలస్వామి పోలిశెట్టి శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

'అడుసుమల్లి'కి జాతీయ పురస్కారం



ప్రజాశక్తి-బాపట్ల : బాపట్లకు చెందిన ప్రముఖ రచయిత, సాహితీవేత్త, ట్రాన్స్‌కో విశ్రాంత ఉద్యోగి అడుసుమల్లి మల్లికార్జున తెలుగు కీర్తి జాతీయ పురస్కారానికి ఎంపికైనట్లు అంతర్జాతీయ శ్రీశ్రీ కళా వేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్ బుధవారం తెలిపారు. సాహిత్య రంగంలో మల్లికార్జున చేస్తున్న కషికి గుర్తింపుగా ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు శ్రీశ్రీ కళావేదిక,తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమి బుక్ ఆఫ్ రికార్డ్స్,మరియు వరల్డ్ రైటర్స్ ఫామ్ ,పోయెట్రీ అకాడమి సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 21న విజయవాడలోని శ్రీకౌత పూర్ణానంద విలాస్ కవితా వేదికలో నిర్వహిస్తున్న సాహితీ కార్యక్రమంలో మల్లికార్జున ఈ పురస్కారాన్ని అందు కోనున్నట్లు తెలిపారు.తనకు ఈ పురస్కారం లభించటం ఆనందంగా వుందని అడుసుమల్లి మల్లికార్జున తెలిపారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన మల్లికార్జునకు పురప్రముఖులు, సాహితీ మిత్రులు సాయిబాబు, జివి,లైబ్రరియన్ శివాజీ గణేషన్, ఎపి.ట్రాన్స్ కో విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ కార్యదర్శి ఆలపర్తి నారాయణస్వామి తదితరులు అభినందనలు తెలిపారు.



పందెంలో తలపడుతున్న పొట్టేళ్లు

రసవత్తరంగా పొట్టేళ్ల పందేలు

ప్రజాశక్తి-పర్చూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని అన్నంబొట్ల వారిపాలెంలో పొట్టేళ్ల పందేలు నిర్వహిస్తున్నారు. ఈ పందేలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వివిధ గ్రామాల నుంచి వచ్చిన కొమ్ములు తిరిగిన పొటేళ్ళు పందేల్లో పాల్గొని ప్రేక్షకులను ఆకర్షిస్తున్నాయి.. ఈపోటీలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వేలాది మంది రైతులు, క్రీడాభిమానులు తరలివచ్చారు. ఎడ్ల పందాల కంటే పొట్టేళ్ల పందేలకు మంచి క్రేజ్‌గాఉంది ఉంది.ఈ పందేల్లో బాపట్ల జిల్లా, బల్లికురవ మండలం, పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన పొటేలు మొదటి బహుమతిగా 20వేలు, పర్చూరు మండలం, వీరన్నపాలెం గ్రామానికి చెందిన పొటేలు రెండవ బహుమతిగా 15వేలు, పర్చూరు మండలం, ఉప్పుటూరు గ్రామానికి చెందిన పొటేలుకి మూడవ బహుమతిగా రూ. 10వేల నగదును కైవసం చేసుకున్నాయి. గత 37 సంవత్సరాలుగా ఎడ్ల పోటీలతో పాటు సాంప్రదాయ క్రీడలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ క్రీడలు అంతరించి పోకుండ వీటిని ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు.

శామ్యూల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి

ప్రజాశక్తి- బాపట్ల

ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పాటు పడిన జంగం శామ్యూల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.రమాదేవి తెలిపారు. కర్లపాలెం మండలం పేరలిపాడులో జంగం శామ్యూల్ సంస్కరణ సభ మంగళవారం నిర్వహించారు. సభకు సిపిఎం పట్టణ కార్యదర్శి తిరుమలరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ ప్రజా ఉద్యమంలో కామ్రేడ్ శామ్యూల్ భిన్నమైన చైతన్యంతో ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తమ సమస్యగా భావించి ఆసమస్య పరిష్కారమయ్యే పోరాడే వ్యక్తి అని తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాడే వ్యక్తులు చిరకాలం బతకాలని ఆశిస్తాం. ఆకాంక్షిస్తాం..అయితే ఏ రోజు ఎలా ఎవరు వెళ్ళిపోతారో ఎవరికీ తెలియదన్నారు. శామ్యూల్



శామ్యూల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రమాదేవి, గంగయ్య

భౌతికంగా దూరమైనా ఆయన ఆశయాలు మనం దూరం చేసుకోవాల్సిన అవసరం లేదన్నారు. ఆయన ఆలోచనల బాటలో అడుగులు వేయడానికి ప్రయత్నం చేద్దామన్నారు. తమ ఊరు రావాలని శ్యామూల్ తనను రెండు,మూడు స్లార్లు కోరినట్లు రమాదేవి తెలిపారు. ఇప్పుడు అనుకోకుండా ఇలా రావాల్సి వచ్చిందిని రమాదేవి ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులుగా ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిపిఎం ఆకుటుంబానికి అండగా నిలుస్తుంది అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ పార్టీ పిలుపునిచ్చిన ఏ కార్యక్రమాన్ని అయినా తన సొంత కార్యక్రమంగా భావించి ఆ పని పూర్తి అయ్యేవరకు ఏకాగ్రతతో శ్యామూల్ పని చేసేవారన్నారు. ఒక మంచి ఉద్యమకారుడిని కోల్పోయామన్నారు. తొలుత శ్యామూల్ చిత్రపటానికి సిపిఎం నాయకులు నివాళు లర్పించారు.నివాళులర్పించిన వారిలో కామ్రేడ్ నరసింహారావు, సిపిఎం సీనియర్ నాయకులు నూతల పాటి కోటేశ్వరరావు వై. భాస్కరరావు కె.నాగేశ్వరరావు, టి.కష్ణమోహన్, ఆర్‌టిసి కుమార్, కొండయ్య, సుభాషిణి, లక్ష్మణ, వైఎస్, బుచ్చిరాజు, ఆవాజ్ సంస్థ నిర్వాహకులు చిస్టి, బాపట్ల ఆర్‌టిసి డిపో సిబ్బంది ఉన్నారు.

వైభవంగా తెప్పోత్సవం

ప్రజాశక్తి- ఇంకొల్లు

ఇంకొల్లు గ్రామంలోని నాగులు చెరువులో కనుమ పండుగ సందర్భంగా బుధ వారం తెప్పోత్సవం నిర్వహించారు. తొలుత స్థానిక చెన్నకేశవ ఆ లయంలోని లక్ష్మిదేవి, విష్ణుమూర్తి, గంగాపార్వతి సమేత భీమేశ్వ రాలయం వీరభద్రేశ్వరాల యంలోని వీరభ్రదేశ్వరుడు విగ్రహా లను మేళ తాళాలతో ఊరేగింపు నిర్వహించారు. అనం తరం దేవతామూర్తు విగ్రహాలను తెప్పపై ఉంచి ఉత్సవం నిర్వహి ంచారు. చుట్టు ప్రక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్దసంఖ్యలో విచ్చేసి తెప్పోత్సవాన్ని తిలకించారు.



తెప్పోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

డాక్టర్ మల్లికార్జునరావుకు నివాళి

ప్రజాశక్తి-బాపట్ల

ప్రజా వైద్యుడు డాక్టర్ దొప్పలపూడి మల్లికార్జునరావు సేవలు చిరస్మరణీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. రమాదేవి తెలిపారు. ప్రజా వైద్యుడు డాక్టర్ దొప్పలపూడి మల్లికార్జునరావు పేదలకు అందించిన వైద్యసేవలు మరువలేనివని ఆమె తెలిపారు. మల్లికార్జునరావు వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి కుటుంబ సభ్యులతో కలిసి రమాదేవి బుధవారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎందరో నిరుపేదలు ప్రస్తుతం కార్పొరేట్ వైద్యం చేయించుకోలేని స్థితిలో బాధపడుతున్నట్లు తెలిపారు. వారిమనసుల్లో ఇప్పటికి



నివాళులర్పిస్తున్న రమాదేవి, తదితరులు

మల్లికార్జునరావు స్థానం పదిలమేనన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య, సీనియం సీనియర్ నాయకులు నూతనపాటి కోటేశ్వరరావు, తిరుమలరెడ్డి, కృష్ణమోహన్, వై. శ్రీనివాస రావు, సుభాషిణి, మల్లికార్జున కుమారుడు రామ్మోహన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రావినూతలలో...

అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు గర్వకారణం

- సినీనటుడు రఘురాబు
- సంక్రాంతి క్రికెట్ కప్ విజేత ఎస్‌కెఎంసిసి చెన్నై జట్టు



మాట్లాడుతున్న సినీ నటుడు రఘుబాబు

ప్రజాశక్తి- మేదరమెట్ల

రావినూతల గ్రామంలో ఆర్‌ఎస్‌సిఎ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టేడియంలో అంతర్రాష్ట్ర క్రికెట్ పోటీలు నిర్వహించటం గర్వకారణమని సినీనటుడు, మా ఆర్టిస్ట్ మూవీ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ ఎర్ర రఘుబాబు తెలిపారు. 31వ సంక్రాంతి క్రికెట్ కప్ పోటీలు ముగింపు సభ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ గత 34 సంవత్సరాల క్రితం ప్రారంభించిన రావినూతల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ క్రికెట్ స్టేడియాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అప్పట్లో విజేతలకు రూ. 1116 రూపాయలు



రన్నర్స్ కప్ అందుకుంటున్న సౌత్‌జోన్ సిసి చెన్నై జట్టు

బహుమతిగా అందజేసినట్లు తెలిపారు. ఇప్పుడు రూ.3 లక్షలు బహుమతిగా అందజేస్తున్నట్లు తెలిపారు. వివిధ రాష్ట్రాల క్రీడాకారులు ఇక్కడికి వచ్చి ఇక్కడ క్రికెట్ ఆటను ఆడటం చాలా గర్వకారణం ఉందన్నారు. సంక్రాంతి అంటేనే రావినూతల అందిరకీ గుర్తుకొస్తుందన్నారు. వివిధ రాష్ట్రల నుంచి జట్లు వచ్చి ఇక్కడ క్రికెట్‌ను ఆడటం వల్ల రావినూతలకు మంచి గుర్తింపు వచ్చిందన్నారు. 50వ సంక్రాంతి క్రికెట్ కప్పు కూడా ఇక్కడే జరగాలని, అందుకు ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులంతా కలిసి ప్రయత్నం చేయాలని ఆయన సూచించారు. ప్రథమ బహుమతి సాధించిన ఎస్‌కెఎంసిసి చెన్నై జట్టును రఘుబాబు అభినందించారు.

విజేత ఎస్‌కెఎంసిసి చెన్నై జట్టు

31వ సంక్రాంతి క్రికెట్ కప్ విన్నర్‌గా ఎస్‌కెఎంసిసి చెన్నై జట్టు నిలిచింది. రన్నర్స్‌గా సౌత్ జోన్ సిసి చెన్నై జట్లు నిలిచాయి. విన్నర్స్‌కు రూ.3 లక్షల రూపాయల నగదు , రన్నర్‌కు రూ.2 లక్షల నగదు షీల్డ్‌ను శ్రీ భ్రమరా వెంచర్ టౌన్‌షిఫ్ పార్ట్‌నర్ సేనారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. తృతీయ స్థానంలో నిలిచి జిసిడిఎ లెవెల్ గుంటూరు జట్టుకు లక్ష రూపాయల నగదు షీల్ట్ అందజేశారు. బెస్ట్ బ్యాట్‌మెన్ ఆఫ్‌దిగా టోర్నమెంట్‌గా నిలిచిన సౌత్ జోన్ సిసి చెన్నై జట్టు క్రీడాకారుడు జితేంద్ర ,బెస్ట్ బౌలర్ ఆఫ్ టోర్నమెంట్‌గా నిలిచిన ఎస్‌కెఎం జట్టు క్రీడాకారుడు గణేష్ ,బెస్ట్ ఫీల్డర్‌గా సౌత్ జోన్ సిసి చెన్నై జట్టు క్రీడాకారుడు అమిత్ సాత్విక్, ప్లేయర్‌ఆఫ్ ది టోర్నమెంట్‌గా జిసిడిఎ జట్టుకు చెందిన మహిప్ కుమార్ నిలిచారు. వీరికి కూడా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అద్దంకి ఆర్‌టిసి డిపో మేనేజర్ రామ్మోహన్ ,ఒంగోలుకు చెందతిన డాక్టర్ సుబ్బరాయుడు, మువ్వ తిలక్, ఆడిటర్ మురళీకష్ణ, సాదినేని మస్తాన్‌రావు, ఆర్‌ఎస్‌ఎస్‌సిఎ కార్యదర్శి కారుసాల నాగేశ్వరరావు,చేబ్రోలు నరసింహా రావు, రామినేని శ్రీనివాసరావు,నరసింహారావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి 5
గురువారం 16 జనవరి 2025


జైనాబీ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న జిఎం ప్రసాదరావు

'పాశ్చామియా' సతీమణి జైనాబీ మృతి

నివాళులర్పించిన 'ప్రజాశక్తి' సిబ్బంది

ప్రజాశక్తి-గిద్దలూరు

ప్రజాశక్తి గిద్దలూరు మాజీ సీనియర్ విలేకరి, కీర్తిశేషులు షేక్ పాశ్చామియా సతీమణి షేక్ జైనాబీ (76) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎంఎల్‌వి ప్రసాదరావు గిద్దలూరు చేరుకొని షేక్ జైనాబీ మృత దేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో ప్రజాశక్తి డివిజన్ ఇన్‌ఛార్జులు వీరారెడ్డి, పూర్ణచంద్రరావు, విలేకరులు వెంకటేశ్వరరెడ్డి, శేషగిరి, నారాయణరెడ్డి, బేగ్, నరసింహమూర్తి తదితరులు ఉన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని 565 జాతీయ రహదారిపై బుధవారం యర్రగొండపాలెం ఎస్ఐ పి చౌడయ్య ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ద్విచక్ర వాహనాలను, కార్లను ఆపి తనిఖీలు చేపట్టారు. ఎస్ఐ పి.చౌడయ్య మాట్లాడుతూ మైనర్లకు తల్లి తండ్రులు వాహనాలు ఇవ్వద్దని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సరియైన పత్రాలు లేని ముప్పై వాహనాలను గుర్తించి జరిమానాలు విధించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర బూత్ కమిటీ కార్యదర్శిగా రవిచంద్ర

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణానికి చెందిన పత్తి రవిచంద్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పోలింగ్ బూత్ కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం నుండి మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి.


జగన్‌తో రవిచంద్ర (ఫైల్)


బహుమతులు అందజేస్తున్న దృశ్యం

'లక్కీ' సౌజన్యంతో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-మార్కాపురం

లక్కీ షాపింగ్ మాల్ సౌజన్యంతో మార్కాపురం పట్టణంలో వాసవి క్లబ్ ఆధ్వ ర్యంలో సంక్రాంతి సంబ రాల్లో భాగంగా ముగ్గుల పోటీలు జరిగాయి. స్థానిక గాంధీ బజార్‌లో జరిగిన ఈ పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని వాసవి క్లబ్ అధ్యక్షులు గాజులపల్లి ప్రసాద్, కార్యదర్శి పాదర్తి హరిబాబు, కోశాధికారి సూరె శ్రీకాంత్‌ల సారథ్యంలో నిర్వహిం చారు. ముఖ్య అతిథులుగా గవర్నర్ విఎన్.కెసిజిఎఫ్ గోల్డెన్ స్టార్ సూరే ఉమా దేవి, గంగిశెట్టి కిరణ్‌కుమార్ హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో విజే తలను ఎంపిక చేశారు.


దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-మార్కాపురం

సంక్రాంతి సందర్భముగా స్థానిక నెహ్రూ బజారులోని శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో సుమారు 800 మంది పేదలు, వృద్ధులు, వికలాంగులకు, సాధువులకు దాతల సహకారంతో వస్త్ర దానం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మార్కాపురం సిఐ పి. సుబ్బారావు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో బాబా మందిరం కార్యదర్శి గోపాలుని హరిహరరావు, అధ్యక్షులు పేరం సత్యనారా యణ, కోశాధికారి నాగరాజు, ఉపాధ్య క్షుడు రామడుగు నాగగోపి, సహాయ కార్యదర్శి కరీంబాషా పాల్గొన్నారు.

'సంక్రాంతి' కనిపించని ఊరు

- పండుగకు పట్టణాలకు వెళుతున్న గ్రామస్తులు
- బోసిపోయిన ఓబులాపురం

ప్రజాశక్తి-కొమరోలు

సంక్రాంతి అంటేనే పల్లెలన్నీ కళకళలాడతాయి. కానీ ఆ గ్రామంలో ప్రతి ఏటా సంక్రాంతి జాడే కనిపించదు. ఇళ్లనీ నిర్మానుష్యంగా ఉంటాయి. అదే కొమరోలు మండ లంలోని బోబులాపురం గ్రామం. సంక్రాంతి పండుగకు ఈ పల్లె నుంచి ప్రజలు పట్టణం బాట పడతారు. దీంతో ఆ గ్రామంలో సంక్రాంతి పండుగ శోభ అసలు కనిపించదు. గంగిరెద్దుల ఆడించుకునే 200 కుటుంబాలు ప్రతి సంక్రాం తి పండుగకు పట్టణ ప్రాంతానికి వెళ్లి తమ కులవత్తి అయిన గంగిరెద్దులను ఆడించుకొని అరకొర సంపాదించు కొని పండగ తర్వాత తిరిగి తమ గ్రామానికి వస్తారు. ఆర్థికంగా వెనుకబడి ఉండటం వల్ల ప్రతి సంక్రాంతికి గ్రామంలో ఇదే పరిస్థితి నెలకొంటుందని గ్రామంలోని వృద్ధులు చెబుతున్నారు. కేవలం గ్రామంలో వృద్ధులు, చిన్నపిల్లలు మాత్రమే గ్రామంలో ఉంటారని అంటున్నారు. అందువల్ల తమ గ్రామంలో సంక్రాంతి పండుగ సందడి ఉండదని తెలిపారు. ఇక్కడి గ్రామస్తులందరూ బెంగళూరు, మైసూరు, విజయవాడ, హైదరాబాద్ ప్రాంతాలకు వెళ్తారని గ్రామంలోని వృద్ధులు తెలిపారు.


బోసిపోయిన ఓబులాపురం గ్రామం

విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్నారు..

డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రభుత్వాలు సంస్కృతి సంప్రదాయాల స్థానంలో విష సంస్కృతిని ప్రోత్సహిస్తున్నాయని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి.రామన్న విమర్శించారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి ఒంగోలు గాంధీ నగర్, గోపాల్ నగర్‌లోని తిరుపతమ్మ గుడి వద్ద ఆటలు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో రామన్న మాట్లాడుతూ ప్రజల్లో ఐక్యమత్యంను అలవర్చేందుకు మానవతా విలువలను చాటి చెప్పేందుకు తాము 1980 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆటలు పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. సిఐటియు జిల్లా నాయకులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడారు. డివైఎఫ్ఐ, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, సిఐటియు, సుందరయ్య విజ్ఞాన కేంద్రం సౌజన్యంతో మహిళలకు, యువతకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో విజేతలకు బహుమతులు అందజేశారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం కన్వీనర్ షేక్ పీరు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నగర కార్యదర్శి వై దానియేలు, ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి బి వీరస్వామి, సయ్యద్ హుస్సేన్, షేక్ పీరు, సయ్యద్ అమీరున్నీసా, టి సురేష్, ఆర్ శ్రీను, టీ దాసు, జాన్ బాషా, జబ్బార్, గురవయ్య పాల్గొన్నారు. తొలుత ప్రజానాట్యమండలి కళాకారులు ప్రదర్శించిన కళారూపాలు అలరించాయి.


బహుమతులు అందజేస్తున్న రామన్న

మున్సిపల్ వర్కర్స్ కాలనీలో..

సంక్రాంతి ఆటల పోటీలను బుధవారం నాడు 8వ డివిజన్ మున్సిపల్ వర్కర్స్ కాలనీ నిర్వహించారు. కేవీపిఎస్, మహిళా సంఘం, ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు, యువకులు, బాలబాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు అట్లూరి రాఘవులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ కాలనీ శాఖ కార్యదర్శి కొర్నెపాటి శ్రీనివాసరావు,బి రామయ్య, కె యాకోబు, సుధీర్,కె రవి, రామకష్ణ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న అట్లూరి రాఘవులు

ఐక్యత కోసం ఆటలు దోహదం

'బాలోత్సవం' రాష్ట్ర కార్యదర్శి రామరాజు

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

సంక్రాంతి ఆటలు ప్రజల్లో ఐకమత్యానికి దోహదపడతాయని బాలోత్సవం రాష్ట్ర కమిటీ కార్యదర్శి యు.రామరాజు పేర్కొన్నారు. సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మంగళవారం రాత్రి 48వ డివిజన్ దిబ్బల రోడ్డులో ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రామరాజు మాట్లాడుతూ బాలబాలికల్లో విజ్ఞానం పెంపొందించేందుకు 'బాలోత్సవం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా వైజ్ఞానిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వచ్చే ఫిబ్రవరిలో ఒంగోలులో బాలోత్సవం కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని బాలబాలికలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం పూర్వ కార్యదర్శి వై.సిద్ధయ్య మాట్లాడుతూ విద్యుత్తు చార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత అదనపు ఛార్జీలతో ప్రజలపై భారాలు మోపి మోసగించారని ఆరోపించారు. పెరుగుతున్న ధరలు, విద్యుత్ చార్జీలు వంటి సమస్యలపై ప్రజలు ఐక్యంగా ఉద్యమించాలన్నారు. 30 ఏళ్లుగా ఈ డివిజన్ సమస్యలపై పోరడుతున్న విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజాసమస్యలపై అందరూ ఐక్యం కావాలని కోరారు. తొలుత మహిళలు, బాలబాలికలకు, యువతకు ముగ్గుల పోటీ, మ్యూజికల్ చైర్స్, క్లాత్ గేమ్, రన్నింగ్, సోసైక్లింగ్, డాన్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఐద్వానగర కార్యదర్శి జి. ఆదిలక్ష్మి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కార్యదర్శి కంకణాల రమాదేవి, ఐద్వా నగర కమిటీ సభ్యులు జి.కళ్యాణి, జి.నాగమ్మ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్, నాయకులు డి.ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రామరాజు

చిన్నారి చికిత్సకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

జిల్లాలోని దర్శి పట్టణం నందు ఇంటెలిజెన్స్ విభా గంలో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న షేక్షావలి కుమార్తె మూడు నెలల చిన్నారి ఎస్ ఎంఎ టైప్ వన్ కండరాల వ్యాధితో బాధపడుతోంది. ప్రస్తుతం బెంగళూరులోని బాప్టిస్ట్ హాస్పిటల్‌లో చేర్పించి చికిత్సలు చేయిస్తున్నారు. చిన్నా రికి వచ్చిన వ్యాధిని తగ్గించా లంటే రూ.16 కోట్ల విలువ కలిగిన ఇంజక్షన్ వేయాలని వైద్యులు నిర్ధా రించారు. కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్షావలికి అంత స్తోమత లేదు. దీంటి తన కుమార్తెను బతికించాలని ప్రాధేయపడుతున్నాడు. తన కుమార్తెను బ్రతికించ వలసినదిగా ప్రభుత్వాన్ని, స్వచ్ఛంద సంస్థలను కోరాడు. ఈ విషయం తెలుసుకున్న యర్రగొండపాలెం నకు చెందిన చైతన్య జ్యోతి ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు తమ వంతు సహాయంగా రూ.7 వేలతో పాటు విట్టా కోటేశ్వర్లు, ఆడిపి నాగయ్య, పబ్బిశెట్టి రవి, డమాం శ్రీనివాసులు, షేక్ ఇమ్రాన్‌లు అదనంగా మరో రూ.3వేలు ఇచ్చారు. మొత్తం రూ.10వేలను చిన్నారి చికిత్స నిమిత్తం విరాళం అందించారు.


చికిత్స పొందుతున్న చిన్నారి


చిన్నారులకు పుస్తకాలు అందజేస్తున్న సుబ్బారావు

చిన్నారుల మధ్య సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నిరంతరం పేదవారి అవసరాలను తీర్చే దిశగా మారెళ్ళ వెంకటేశ్వర్లు కాశీరత్తమ్మ సేవా ట్రస్ట్ బుధవారం బొమ్మరిల్లు అనాథ చిన్నారుల ఆశ్రమంలో సంక్రాంతి పర్వదినం సందర్భంగా పెద్దల జ్ఞాపకార్థం నూతన వస్త్రా లను, మధ్యాహ్న భోజనం అందజేశారు. మాజీ కౌన్సిలర్ తన్నీరు సురేష్ మాట్లాడుతూ ,మారెళ్ళ వెంకటేశ్వర్లు కాశీ రత్తమ్మ సేవా ట్రస్ట్ నిర్వాహ కులు మారెళ్ళ వివేకానంద, సుబ్బారావు ప్రతి సంవత్సరం నూతన వస్త్రాలను అందజేయడం ఓ గొప్ప కార్యక్రమమని అన్నారు. కార్యక్రమంలో మారెళ్ళ చంద్రశేఖర్ ఆచారి, బొమ్మరిల్లు నిర్వాహకులు కాశిం, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.


తాలూకా స్టేషన్ వద్ద నీలం నాగేంద్రరావు

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సంక్రాంతి సందర్భంగా కోళ్ల కోసం ఆటోలో వెళ్తున్న గిరిజన యువకులపై దారి కాచి దాడి చేసిన గంజాయి రౌడీ మన్నెం అంజి ముఠాని అరెస్ట్ చెయ్యాలని దళిత హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నీలం నాగేంద్ర రావు డిమాండ్ చేశారు. బుధవారం బాధిత గిరిజన యువకులతో కలిసి ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ మంగళ వారం రాత్రి కనుమ పండుగ సందర్భంగా కోళ్ళను కొను గోలు చేయటానికి ఒంగోలు శ్రీరామ్ కాలనీకి చెందిన గిరిజన యువకులు వారి ఆటోలో బయలుదేరారన్నారు. ఇదే అదనుగా భావించిన గంజాయి బ్యాచ్ మన్నెం రామాంజినేయులు ముఠా కారులో వచ్చి దాడి చేశా రన్నారు. గిరిజన యువకులు దేవరకొండ రాజా కుమార్, కుంబ రాము పై రాళ్లతో విచక్షణా రహితంగా దాడి చేశారు. బాధితులకు రక్త గాయాలు అయ్యాయ న్నారు. గిరిజన యువకులపై దాడి చేసిన అంజి ముఠా ను అరెస్ట్ చేయాలన్నారు. కార్యక్రమంలో సుబ్బారావు, కాకుమాను రవి పాల్గొన్నారు.

సంక్రాంతి వేడుకలు అభినందనీయం : బూచేపల్లి

ప్రజాశక్తి-దర్శి

కళాంజలి ఈవెంట్స్‌లో జబర్దస్త్ యాక్టర్ రాకెట్ రాఘవ టీం పాల్గొనడం అభినందనీయమని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కళాంజలి ఈవెంట్స్ అధినేత డి రమేష్ ఆధ్వర్యంలో జరిగిన డాన్స్ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలుగు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకునేందుకు ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం చేస్తాయని అన్నారు. సాధారణ ప్రజలు, యువకులతోపాటు విభిన్న ప్రతిభావంతులను సైతం ప్రోత్సహించే విధంగా పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ప్రతి సంవత్సరం ఇలాంటి పోటీలు నిర్వహించాలని నిర్వాహకులకు సూచించారు. పోటీల్లో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరము వికలాంగుల డాన్స్ పోటీలు కూడా అందర్నీ ఆకట్టుకున్నాయి. ముందుగా చిన్నారులు నిర్వహించిన డాన్స్ కార్యక్రమాలు అలరించాయి. ఈ సందర్భంగా జబర్దస్త్ యాక్టర్లు రాకెట్ రాఘవ టీం చేసిన హంగామా అందర్నీ ఆకర్షించింది. పుర ప్రజలు పెద్ద ఎత్తున హాజరై వీక్షించారు. కార్యక్రమంలో పలువురు కళాకారులుతోపాటు వైసిపి మండల అధ్యక్షుడు వెన్నపూస వెంకటరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సోము దుర్గారెడ్డి, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి


బహుమతులు అందిస్తున్న ఎస్సై విజయ్‌కుమార్

కన్నుల పండుగగా ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - దొనకొండ

మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు కన్నుల పండుగగా జరిగాయి. దొనకొండ నాల్గురోడ్ల కూడలిలో శ్రీ విజయాంజనేయస్వామి దేవాలయంలో ధర్మకర్త బాలిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ముగ్గులు వేశారు. విజేతలకు ఎస్ఐ విజయకుమార్ బహుమతులు అందజేశారు. స్థానిక వివిపురంలో తెలుగు యువత ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో విజేతలకు టిడిపి మండల అధ్యక్షుడు శివకోటేశ్వరరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగు రంగుల ముగ్గులు వేశారు.


మట్టితోలి వదిలేసిన రోడ్డు నిర్మాణం

ఆగిన రోడ్డు నిర్మాణ పనులు

ప్రజాశక్తి - సిఎస్ పురం

రూ.కోట్లు వెచ్చించి రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినప్పటికీ పనులు పూర్తి కాకుండానే అసంపూర్తిగా మిగిలి పోతున్నాయి. అధికారులు, పాలకవర్గాలు ఆగిపోయిన రోడ్డు గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. 2019లో టిడిపి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు శీలంవారిపల్లి నుండి పెద్దరాజుపాలెం వరకు ఐదు కిలోమీటర్ల దూరం తారు రోడ్డు నిర్మాణం నిమిత్తం రూ.3.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. అప్పట్లో కొంత మేర రోడ్డు నిర్మాణ పనులు జరిగాయి. కేవలం మట్టి రోడ్డు నిర్మాణం మాత్రమే చేశారు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి. 2019ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ రోడ్డు నిర్మాణం గురించి పూర్తిగా విస్మరించారు. అప్పటి కనిగిరి శాసన సభ్యులు కదిరి బాబురావు రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. శీలంవారిపల్లి నుండి పెదరాజుపాలెం వరకు రోడ్డు నిర్మాణం జరిగితే ఆయా గ్రామాలకు రాకపోకలు అనుకూలంగా ఉంటాయనే ఉద్దేశంతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. కొంత నిధులు వెచ్చించి పనులు జరిగాయి. ప్రస్తుతం వర్షాలకు రోడ్డు కోతకు గురైంది. వాహనాలు వెళ్లేందుకు కూడా వీల్లేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికైనా అధికారులు, పాలకవర్గం స్పందించి ఆగిపోయిన తారు రోడ్డు నిర్మాణం పనులు తిరిగి ప్రారంభించి రోడ్డు పూర్తి చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.


అన్నదానం చేస్తున్న గువ్వల రాజశేఖరరెడ్డి

అన్నదానం గొప్పదానం

ప్రజాశక్తి - పొదిలి

సంక్రాంతి 3వ రోజు కనుమ పండుగ సందర్భంగా స్థానిక అయ్యప్ప దేవస్థానంలో గువ్వల రాజశేఖరరెడ్డి కుటుంబ సభ్యులు పేదలకు అన్నదానం ఏర్పాటు చేశారు. తెలుగు ప్రజల పెద్ద పండుగ సందర్భంగా పేదల కోసం అన్నదానం చేయడం దేవుడిచ్చిన వరమని పలువురు కొనియాడారు. సామాజిక సేవ కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు రాజశేఖరరెడ్డిని అభినందించారు.

‘హైపర్ ఆది’కి జ్ఞాపిక అందజేత

ప్రజాశక్తి-దర్శి

కళామతల్లి ముద్దుబిడ్డ, తెలుగు సినిమా నటుడు, స్క్రిప్ట్ రైటర్, జబర్దస్త్ కమేడియన్‌గా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటుగా ఇతర రాష్ట్రాలలో కూడా పేరు ప్రఖ్యాతులు ఘడించిన హైపర్ ఆదిని సంక్రాంతి సందర్భంగా తన స్వగ్రామమైన పల్లామల్లిలో మర్యాద పూర్వకంగా మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు కపురం శ్రీనివాసరెడ్డి, దేవతి వరప్రసాద్ బుధవారం కలిశారు. 27 సినిమాలలో నటించి, బుల్లి తెరమీద అనేక వేశాలు చేసి, హైపర్ ఆదిగా ప్రకాశం జిల్లాకేగాకుండా దర్శి ప్రాంతానికి కూడా పేరు ప్రఖ్యాతులు గడించినందుకు వీరిరువురూ ఆయనను మానవత సంస్థ కండువా, జ్ఞాపికతో అభినందించారు. ఈ సందర్భంగా హైపర్ ఆదితో మానవత సంస్థ కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దర్శి నియోజకవర్గమే కాకుండా పరిసర ప్రాంత మండలాల్లో మానవత స్వచ్ఛంద సేవాసంస్థ చేస్తున్న సేవలకు, కార్యక్రమాలకు మంచి ఆదరణ లభిస్తుందని తెలిపారు. సంస్థలోని 9 అంశాలను, ఆశయాలను సవివరంగా ఆయనకు వివరించారు. ఉత్తమ సమాజ స్థాపన కోసం తమ సంస్థ నిరంతరం పని చేస్తుందని తెలిపారు. అన్నీ విషయాలు సావధానంగా విన్న తర్వాత ఎవరూ చేయని చాలా పుణ్య కార్యక్రమాలు చేస్తున్నారని చెప్పి సంస్థను మెచ్చుకొనుటయే గాకుండా సంస్థ గురించి సుదీర్ఘంగా చర్చించిన తర్వాత తానూ తమ టీమ్ వారందరమూ సంస్థకు సహాయ, సహకారాలు అందజేసి మన ప్రాంతంలో మరిన్ని సేవలందించేందు అన్ని విషయాలలో ఎల్లప్పుడూ సంస్థకు వెన్నుదన్నుగా నిలుస్తామని ఆది స్పష్టమైన హామీనిచ్చినట్లు శ్రీనివాసరెడ్డి తెలిపారు.


యాక్టర్ హైపర్ ఆదిని కలిసిన మానవత సంస్థ ప్రతినిధులు

విశ్రాంతి తహశీల్దార్ వెంకటేశ్వర్లు మృతి

ప్రజాశక్తి-దర్శి


బోగు వెంకటేశ్వర్లు (67)

విశ్రాంతి తహశీల్దార్ బోగు వెంకటేశ్వర్లు (67) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. పట్టణంలోని కురిచేడురోడ్‌లో ఉన్న ఆయన స్వగృహంలో గుండెపోటు రావడంతో సమీపంలోని ఒక ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా అక్కడే మృతి చెందారు. గోగు వెంకటేశ్వర్లు పామూరు తహశీల్దార్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేశారు. ఆయన దర్శిలో కొంతకాలం డిటిగా, దొనకొండలో రేషన్ డిటిగా పని చేశారు. ఆయన అందరిమన్నలను పొందారు. ఆయనకు భార్య, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. అంత్యక్రియలు నేడు చలివేంద్ర వద్ద ఆయన వ్యవసాయ క్షేత్రంలో జరగనున్నాయి. ఆయన మృతి పట్ల పలువురు సంతాపం తెలిపారు. ఆయన స్వగ్రామం కనిగిరి మండలం లింగారెడ్డిపల్లి కాగా వృత్తిరీత్యా దరిశిలో స్థిరపడారు.


బొడ్డికూరపాడులో కోలాటం ప్రదర్శిస్తున్న చిన్నారులు

నగరోత్సవం

ప్రజాశక్తి-తాళ్ళూరు

మండలంలోని బొడ్డికూరపాడు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత మాధవస్వామి దేవాలయం, శ్రీగంగా పర్వతవర్ధిని సమేత సోమేశ్వరస్వామి దేవాలయంల నుండి స్వామి వార్ల, అమ్మ వార్ల ఉత్సవ విగ్రహాలను గ్రామంలోని వీధుల్లో మేళ తాళాలతో ఉత్సవం నిర్వహించారు. గ్రామ పెద్దలు పోలంరెడ్డి రమణారెడ్డి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పోలంరెడ్డి రమణారెడ్డి, సుబ్బారెడ్డి, వీరనాగిరెడ్డి, రాఘవరెడ్డి, గుజ్జుల గోపాలరెడ్డి, సన్నపురెడ్డి ఆంజిరెడ్డి, పులి బాలకోటిరెడ్డి, ఆలయ పూజారులు రమణయ్య, వాసు పాల్గొన్నారు. గ్రామంలోని రామాలయం సెంటర్‌లో చిన్నారులు, మహిళలు సాంప్రదాయ బద్ధమైన జానపద, భక్తి ప్రధానమైన కోలాటం ప్రదర్శించారు. మామిడి శివశంకర్ మాస్టారు వద్ద శిక్షణ పొందిన చిన్నారులు, మహిళల కోలాట ప్రదర్శన ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. చిన్నారులు, మహిళలకు కోలాటంలో శిక్షణ ఇచ్చిన మామిడి శివశంకర్ మాస్టారును గ్రామపెద్దలు, కోలాటం బృందం సభ్యులు శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, మహిళలు, పురుషులు, చిన్నారులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-దర్శి

మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని వెలమ వారి బజారులో ఏఐటియుసి, బికెఎంయు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆటలు, ముగ్గుల పోటీల్లో నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు సిఐ వై రామారావు బహుమ తులు అందజేశారు. సభకు బికెఎంయు రాష్ట్ర నాయకులు, ఏఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు జూపల్లి కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. సభలో సిఐ వై రామారావు మాట్లాడుతూ భారతదేశ సంస్కృతికి గుర్తుగా ముగ్గులు వేయటం అభినందనీయమన్నారు. ఆటలు, ముగ్గుల పోటీలలో గెలిచిన విజేతలకు బహుమతులు అందజేశారు. ముగ్గుల పోటీలలో కొరిసపాడు మండలం ఎర్రబాలెంకు చెందిన ఎం ప్రత్యూష మొదటి బహుమతి, బాపట్ల జిల్లా రేపల్లె మండలంకు చెందిన మాదిరెడ్డి చైత్రహాసిని ద్వితీయ బహుమతి, దర్శి పట్టణంకు చెందిన జూపల్లి యామిని తృతీయ, బలుమూరి అంజలి 4వ బహుమతి సాధించుకున్నారు. కుర్చీల ఆటలో పగడాల అంజలి ప్రథమ, ఉరిబిండి సరస్వతి ద్వితీయ, హైదరాబాదుకు చెందిన మైకల్లి కావ్య తృతీయ బహుమతి పొందారు. పిల్లల మ్యూజికల్‌చైర్ ఆటలో జె బన్నీ ప్రథమ, జె హర్షిత్ ద్వితీయ, లెమన్ అండ్ స్పూన్ ఆటలో జి వర్షిని ప్రథమ, బి నాగచైతన్య ద్వితీయ, జె యామిని తృతీయ స్థానంలో నిలిచారు. సైకిల్ స్లో ఆటలో జె హర్షిత్, బి నాగచైతన్య ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. తొలుత ఆటల పోటీలను వెలమ శ్రేయోబివృద్ధి సంఘం అధ్యక్షులు జూపల్లి వీరరావు ప్రారంభించారు. సిఐ వై రామారావు దంపతులను, బికెఎంయు రాష్ట్ర నాయకుడు జూపల్లి కోటేశ్వరరావులను ప్రజాసంఘాలు, వెలమ సంఘం కమిటీలు కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన భరతనాట్యం, స్కిప్ప్, కపుల్ డాన్స్, సాంస్కృతి కార్యక్రమాలు, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. అతిధులను ఏఐటియుసి కార్యదర్శివర్గ సభ్యులు కోటంశెట్టి హనుమంతురావు వేదికపైకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రావుస్ ఫర్నిచర్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ అధినేత చెట్రోలు సుధాకర్, చెన్నై పట్టణానికి చెందిన జె జయలక్ష్మి, రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి వసంతపురపు హరి, కల్లూరి పెద్దఆంజనేయులు, పానుగంటి వెంకటకోటేశ్వరరావు, మోడల్ స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ గోపిశెట్టి అనూష, దళిత ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకుడు అట్లూరి రామారావు, జూపల్లి గురవ్పనాయుడు, టిడిపి నాయకుడు జూపల్లి కోటేశ్వరరావు, చెట్రోలు విజయ్‌కుమార్, జూపల్లి రవీంద్ర, గోసుల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ముగ్గుల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న సిఐ వై రామారావు

ఉత్సాహంగా ఎడ్ల పోటీలు

ప్రజాశక్తి-బాపట్ల

సంక్రాంతి సంబరాలలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో 15వ రాష్ట్ర స్థాయి ఎడ్ల బలప్రదర్శన, నాటుబండి ఆకురాధ పోటీలు నిర్వహించారు. పోటీల్లో 36 ఎడ్ల జతల పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు బాపట్ల డిఎస్‌పి రామాంజనేయులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

తొలివిభాగం విజేతలు ...

వేటపాలెం మండలం పందిళ్ళపల్లి గ్రామానికి చెందిన పాలపర్తి మూగయ్య ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచిచి రూ.30 వేల నగదు బహుమతిని కైవసం చేసుకుంది. బాపట్ల మండలం పోతురాజు కొత్తపాలెంకు చెందిన మరుప్రోలు చెన్నకేశవ రెడ్డి జత ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 25 వేలు, బాపట్ల మండలం ముత్తాయపాలెం గ్రామానికి చెందిన అంగిరేకుల మోహన్ వెంకట మణికంఠ యాదవ్ ఎడ్ల జత నాల్గవ స్థానంలో నిలిచి రూ. 20,వేలు, వేటపాలెంకు చెందిన బల్లిపల్లి కోటేశ్వరరావు, ఈపురు పాలెంకు చెందిన అనుష్ కుమార్ యాదవ్ జత ఐదో స్థానంలో నిలిచి రూ.15 వేలు, బల్లిపల్లికి చెందిన దేవరపల్లి సాయి భార్గవరెడ్డి, వేటపాలెంకు చెందిన కోటేశ్వరరావు ఎడ్ల జత ఆరో స్థానంలో నిలిచి రూ.10 వేలు, పురుషోత్తం పట్నంకు చెందిన షేక్‌బడే ఎడ్ల జత ఏడో స్థానంలో రూ. 7,500 నగదు బహుమతిని అందుకున్నాయి.

రెండవ విభాగం విజేతలు...

కానుమాను మండల గార్లపాడుకు చెందిన రామినేని శ్రీనివాసరావు ఎడ్ల జత ప్రథమ స్థానంలో నిలిచి రూ.20,000 నగదును అందుకున్నాయి. మోపిదేవి మండల కుక్కలగడ్డ కొట్టపాలెంకు చెందిన తుంగల నాగసింధు ఎండ్ల జత ద్వితీయ స్థానంలో నిలిచి రూ. 15,000, విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన పల్లిశెట్టి ఉమామహేశ్వరరావు తృతీయ స్థానంలో నిలిచి



బాపట్లలో పోటీలను పారంభిస్తున్న మాజీ ఎమ్మెల్సీ అన్నం

రూ.10,000, చినగంజాం మండలం సోపిరాలకు చెందిన ముంగర విజయలక్ష్మి ఎడ్ల రూ.7,500, మరుప్రోలువారి పాలెంకు చెందిన అసోది శివానందలసాయి రెడ్డి ఎడ్ల నాల్గవ స్థానంలో నిలిచి రూ.5,000 నగదు బహుమతిని కైవసం చేసుకున్నాయి. పోటీల్లో ప్రతి ఎడ్ల జతకు బాపట్ల కాపు సేవా సంఘం ఆధ్వర్యంలో ఇత్తడి బిందె,బకెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమవారి పాలెం శ్రీకోదండ రామాలయ నిర్వాహకులు లేళ్ళ నరేంద్ర, రౌతు రామాజనేయులు, రౌతు శ్రీనివాసరావు, ఆళ్ళ శ్రీనివాసరావు, ధూళిపాళ్ల శ్రీనివాసరావు, ఈమని నగేష్, జిడుగు శ్రీనివాసరావు, కారుమురి అంజనేష్, భీమా నరసింహారావు, కారూమూరి శ్రీనివాసరావు, భీమా శంకర్, కాపు సేవా సంఘం అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు ఇపనగోళ్ళ రంగారావు, కోటికలపూడి సురేష్, భీమా కోటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని అన్నంబొట్లవారిపాలెంలో 37వ జాతీయ స్థాయి ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు తిలకించేందుకు వచ్చిన ప్రేక్షకులతో క్రీడా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. గోరంట్ల రత్తయ్య చౌదరి ప్రాంగణంలో నాల్గవ రోజు పెద్ద సైజు విభాగం ఎడ్లకు పోటీలు



పర్చూరులో బండ లాగుతున్న ఎడ్ల జత

నిర్వహించారు. ప్రేక్షకుల ఈలలు, కేరింతలతో క్రీడా ప్రాంగణం మార్మోగిపోయింది. పెద్ద సైజు విభాగంలో 22 క్వింటాళ్ళ బండను 25 నిమిషాల వ్యవధిలో ఎక్కువ దూరం లాగిన ఎడ్ల జతను విజేతగా ప్రకటిస్తారని నిర్వాహకులు కొనకంచి సుబ్బారావు తెలిపారు. ఈ పోటీలో 9 ఎడ్ల జతలు పాల్గొననున్నట్లు ఆయన తెలిపారు. విజేతలకు మొదటి బహుమతిగా 1,00,116, రెండవ బహుమతిగా 75,116, మూడవ బహుమతిగా 60,116 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కడపటి వార్తలు అందేసరికి గుంటూరు జిల్లా, తాడేపల్లి మండలం, కుంచనపల్లి గ్రామానికి చెందిన పులగం ద్విసజ్ఞా రెడ్డి ఎడ్ల జత 25 నిమిషాల వ్యవధిలో 22 క్వింటాళ్ళ బండను 2,816 అడుగుల దూరం లాగి ముందంజలో కొనసాగుతున్నాయి. అదేవిధంగా ఇదే గ్రామంలో గొట్టిపాటి హనుమంతరావు మెమోరియల్ ప్రాంగణంలో జూనియర్స్ విభాగంలో ఎడ్ల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీలకు 8 జతలు పాల్గొననున్నట్లు నిర్వహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. కడపటి వార్తలు అందే సరికి కష్ణా జిల్లా, హనుమాన్ జంక్షన్ కు చెందిన కేతినేని తేజోమూర్తి ఎడ్లజత 17 క్వింటాళ్ళ బండను 20 నిమిషాల్లో 4,826 అడుగుల దూరం లాగి ముందంజలో కొనసాగుతున్నాయి.



మాట్లాడుతున్న శీనివాసరావు

విద్యుత్ భారాలు ప్రభుత్వమే భరించాలి : సిపిఐ

ప్రజాశక్తి- భట్టిప్రోలు

విద్యుత్ సర్‌ఛార్జీల భారాన్ని ప్రభుత్వమే భరించాలని సిపిఐ వేమూరు నియోజకవర్గ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే విద్యుత్ ఛార్జీలను పెంచమని హామీలు ఇచ్చిందన్నారు. ఈ నెలలో వచ్చిన విద్యుత్ బిల్లులను పరిశీలిస్తే అసలు కంటే అదనపు ఛార్జీల భారం అధికంగా ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుంచి 2019 వరకూ ఐదు సంవత్సరాలకు ట్రూ ఆప్ ఛార్జీలు, మూడు సంవత్సరాల ఎఫ్‌పిపిసి చార్జీలను వసూలు చేస్తూ ప్రజలపై పెను భారాన్ని మోపటం అన్యాయమన్నారు. . ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కమిటీ సభ్యులు గొట్టుముక్కల బాలాజీ, ప్రజా సంఘాల నాయకులు వి. శ్రీనివాసరావు, కె. వీరమోహన్‌రావు, బి. యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగు అప్పగింత

ప్రజాశక్తిద- ఇంకొల్లు

మండల పరిధిలోని పావులూరు గ్రామానికి చెందిన చిరిపుడి యోగేశ్వరి బుధవారం ఒంగోలు నుంచి ఇంకొల్లుకు ఆర్‌టిసి బస్సులో వచ్చింది. బస్టాండ్‌లో బస్సు వెళ్లింది. బస్సు దిగే సమయంలో తన బ్యాగ్‌ను బస్సులోనే మర్చిపోయింది. కొద్దిసేపటి తర్వాత బస్సు తిరిగి ఒంగోలు వెళ్లింది. ఈ క్రమంలో కొంత సమయం తర్వాత తన చేతిలోని బ్యాగు లేని విషయాన్ని గుర్తించి యోగేశ్వరి గుర్తించింది. బస్టాండ్ వద్దకు వచ్చి కంట్రోలర్ షేక్ బాబుకు బ్యాగు విషయం గురించి తెలిపింది. స్పందించి కంట్రోలర్ బాబు ఒంగోలు ఆర్‌టిసి అధికారులకు సమాచారం అందించారు. అనంతరం ఆ బ్యాగును ఒంగోలు నుంచి తెప్పించి బాధితురాలికి అందజేశారు.



మాట్లాడుతున్న షరీఫ్

తెలుగు రాష్ట్రాల స్థాయి నాటిక పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -యద్ధనపూడి

మండల పరిధిలోని అనంతవరం గ్రామములో రెండు తెలుగు రాష్ట్రాల స్థాయి పరిషత్ నాటిక పోటీలు ప్రారంభయ్యాయి. ఈ పోటీలను రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సహాదారు మహ్మద్ షరీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితులలో పరిషత్ నాటిక పోటీలు నిర్వహించడం అభినందనీయన్నారు. మంచి నాటికలను ప్రజలు ఆధారించి కళాకారులను ప్రోత్సహించాలన్నారు. మంచి నాటికలను ప్రజలు తప్పక ఆదరిస్తారని తెలీఇపారు. నేటి సమాజ పరిస్థితులకు దర్పణం పట్టేలా నాటికలు ఉండలన్నారు. ఒస్వేచ్ఛ, ఐఎట్ ఇండియా, కమనీయం నాటికలు బుధవారం ప్రదర్శించారు. నాటిక పోటీలు సందర్భంగా భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మారెళ్ల వంశీ, అమరావతి జెఎసి కన్వీనర్ పి. సుధాకర్, పరిషత్ అధ్యక్షుడు గుదే పాండు రంగారావు, నియోజకవర్గ నాయకులు రావిపాటి సీతయ్య, రంగయ్య, ఆదినారాయణ, నిర్వహణ కమిటీ సభ్యులు పెదవల్లి వెంకటేశ్వర్లు,వంశీ కష్ణ, తారక రామారావు, పి. శ్రీనివాసరావు, జయ రామ కష్ణ, శివ సుబ్బారావు, మండవ శ్రీనివాసరావు, పి. సాంబయ్య, జివి. సుబ్బారావు, జి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రమాద భరితంగా రహదారి

- గుంతల్లో గ్రానైట్ వ్యర్థాలు
- జారి పడుతున్న వాహన చోదకులు

ప్రజాశక్తి - రేపల్లె

కూటమి ప్రభుత్వం సంక్రాంతి నాటికి కల్లా గుంతలు లేని రహదారులు నిర్మిస్తామని చెప్పింది. అందులో భాగంగా మిషన్ పాత్ హోల్ ఫ్రీ పేరిట రోడ్ల మరమ్మతులకు ప్రత్యేక నిధులు కేటాయించింది. అందులో భాగంగా ఇసుకుపల్లి... నిజాంపట్నం నూతన రహదారి నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశారు. రెండు నెలల క్రితం ఈ రహదారి నిర్మాణానికి ఆర్భాటంగా శంకుస్థాపన చేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకూ రోడ్డు పనులు ప్రారంభించ లేదు. ఈ రోడ్డు పై ప్రయాణం చేయాలంటే ప్రాణం మీద కొస్తుంది. వాహనమెక్కితే నడుములు కదులుతున్నాయి. రోడ్డుపై ఉన్న గుంతలతో గుండెలదురుతున్న పరిస్థితి నెలకొంది. దీంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ రోడ్డు నిర్మాణం దక్కించుకున్న కాంట్రాక్టర్ పట్టించుకోవడం లేదు. తాత్కాలికంగా గుంతలు పూడ్చేందుకు కాంట్రాక్టర్ గ్రానైట్ వేస్ట్ ముక్కలు తీసుకొచ్చి గుతలపై పోశాడు. అయితే రాకపోకలు సాగించే



రాకపోకలకు ఇబ్బందిగా మారిన గ్రానైట్ వ్యర్థాలు

సమయంలో గ్రానైట్ వేస్ట్ ముక్కల కారణంగా వాహనాలు పక్కకు జరిగి పోతున్నాయి. ప్రయాణికులు పడిపోతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల వాహనం జారి పడిపోవడంతో ఓ వ్యక్తి తలకు బలమైన గాయాలు తగిలాయి. రోడ్లపై గుంతలు పూడ్చేందుకు గ్రానైట్ వేస్ట్ ముక్కలు పోయటమేంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పరిస్థితి గమనించిన ఆర్‌అండ్ బి అధికారులు రోడ్డుపై గుంతల్లో వేసిన గ్రానైట్ వేస్ట్ ముక్కులను తొలగించే దిద్దుబాటు చర్యలకు పూను కున్నారు. స్థానిక ప్రజాప్రతినిధులు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు కానీ క్షేత్రస్థాయిలో రోడ్లపై దష్టి పెట్టిన దాఖలాలు లేవు. నియోజకవర్గంలోని ఏ ఒక్క రహదారి పూర్తి మరమ్మ తులకు నోచలేదు. గ్రామాలలో రోడ్లు గుంతల మయం కావటంతో ప్రజలు గంటలు తరబడి ప్రయాణించాల్సి వస్తుంది. అధికారులు ప్రజా్ర పతినిధులు స్పందించి వెంటనే రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారిపై తోలిన గ్రానైట్ వ్యర్థాలు



రైతులతో మాట్లాడుతున్న ఎస్ఐ

రహదారి పనులు అడ్డగింత

ప్రజాశక్తి- కారంచేడు

బాపట్ల జిల్లా, పర్చూరు, కారంచేడు పరిధిలో నిర్మిస్తున్న వాడరేవు–పిడుగురాళ్ల 167ఎ జాతీయ రహదారి నిర్మాణ పనులను కారంచేడు రైతులు బుధవారం అడ్డు కున్నారు. పంట కాలువలోని నీరు పొలాల్లోకి రావడానికి వీలుగా అండర్ టన్నెల్ నిర్మించకుండా నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణం చేపట్టడంతో రైతుల ఆగ్రహం వ్యక్తం చేశారు. కారంచేడు మండలం రామానాయుడు వారధి జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించిన గ్రావెల్ టిప్పర్లను అడ్డుకొని ధర్నాకు దిగారు. పొలాల్లోకి నీరు రావటానికి రహదారి క్రింద పైపులు వేయాలని , వ్యవసాయ ఉత్పత్తులు వాహనాలు తోలుకోవడానికి వీలుగా అండర్ టన్నెల్ నిర్మించాలని రైతులు డిమాండ్ చేశారు. రైతుల ధర్నా గురించి సమాచారం అందుకున్న కారంచేడు ఎస్ఐ వెంకటరావు ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు సర్ది చెప్పారు. రహదారి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని రైతులకు సూచించారు.

కన్నుల పండుగగా పార్వేట

- తరలివచ్చిన ఉత్సవ మూర్తులు
- ప్రత్యేక పూజలలో ఎమ్మెల్యే దామచర్ల

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

సంక్రాంతి పండుగ కనుమ సందర్భంగా ఒంగోలు నగరంలో నిర్వహించిన పార్వేట కార్యక్రమం కన్నుల పండుగగా సాగింది. ఒంగోలు నగరంలోని పలు దేవాలయాలలోని ఉత్సవ మూర్తులు పారువేటకు తరలివచ్చాయి. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. పారువేట సందర్భంగా గద్దలగుంటలో పండుగ వాతావరణం నెలకొంది. ధనుర్మాసం సందర్భంగా ఒంగోలు నగరంలోని పలు దేవాలయాలలో గత నెల రోజులు పూజలు అందుకున్న ఉత్సవ మూర్తులు ప్రత్యేక అలంకరణలో వాహనాలలో గద్దలగుంటకు తరలివచ్చాయి ఈ సందర్భంగా ఒంగోలు నగరంలోని ప్రధాన కూడళ్లలో ఉత్సవ మూర్తులకు ప్రజలు హారతులిచ్చి వారి భక్తిప్రపత్తులను చాటుకున్నారు. పారువేటలో పాల్గొనేందుకు వస్తున్న వివిధ రాజకీయ పార్టీల నేతలకు స్వాగతం పలుకుతూ నాయకులు, కార్యకర్తలు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు గద్దలగుంటకు చేరుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. పారువేట సందర్భంగా గద్దలగుంటలోని పలు ప్రాంతాలలో సంగీత విభావరి, నృత్య కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. నగర ప్రజలు పారువేటను వీక్షించేందుకు వేలాదిగా ప్రజలు తరలిరావటంతో గద్దలగుంట ప్రాంతం తిరునాళ్ళను తలపించింది. కార్యక్రమంలో పలు పార్టీలకు చెందిన నేతలు, నగర ప్రజలు పాల్గొన్నారు.



నాయుడిపాలెం టీమ్

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జరుగుతున్న వైఎస్ఆర్ క్రికెట్ టోర్నమెంట్‌లో బుధవారం జరిగిన మూడవ మ్యాచ్‌లో పెద్ద దోర్నాల ఏబియం టీం మొదట బ్యాటింగ్‌లో 40 పరుగులు చేసింది. తన అద్భుతమైన బౌలింగ్‌తో యర్రగొండపాలెం అంబేద్కర్ 11 బుల్లెట్స్ టీంను 24 పరుగులతో కట్టడి చేసి 16 పరుగుల తేడాతో పెద్ద దోర్నాల ఏబియం టీం ఘన విజయం సాధించారు. గురిజేపల్లి టీమ్‌పై త్రిపురాతకం మండలంలోని దూపాడు టీమ్ గెలుపొందింది. పుల్లలచెరువు మండలంలోని చాపలమడుగు టీమ్‌పై నాయుడిపాలెం టీమ్ గెలుపొందింది. వెంకటరెడ్డి పల్లి టీమ్‌పై పెద్ద దోర్నాల మండలంలోని దోర్నాల విక్టరీ టీమ్ విజయం సాధించింది. పెద్దారవీడు మండలంలోని దేవరాజుగట్టు టీమ్‌పై పెద్దారవీడు టీమ్ గెలుపొందింది. కార్యక్రమంలో వైసిపి నాయకులు నరెడ్డి వెంకటరెడ్డి, కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, ముసలారెడ్డి, జబివుల్లా, ఒంగోలు సుబ్బారెడ్డి, రాములు నాయక్, మజీద్, సింగా ప్రసాద్, గాలిరెడ్డి, ఆదిశేషు, సత్తిరెడ్డి, కోటిరెడ్డి, కందూరి గురు, వెంకట రమణారెడ్డి పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న రమాదేవి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి పట్టణంలోని గార్లపేట రోడ్డులో మరియు మంగళిమాన్యంలో డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మంగళవారం ముగ్గులు, తాడు లాగుట పోటీలను నిర్వహించారు. మహిళలు ఉత్సాహంగా పోటీలలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. ముఖ్యఅతిథిగా పీసీ పల్లి ఎంఈఓ ఆర్ శ్రీనివాసచారి మాట్లాడారు. కార్యక్రమంలో జెవివి నాయకులు వి మాలకొండారెడ్డి, ఐద్వా జిల్లా కార్యదర్శి కె.రమాదేవి, కనిగిరి అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కె.బషీర, లక్ష్మీ ప్రసన్న, నాయకులు వెంకటమ్మ, శాంత కుమారి, రమణమ్మ, షమీన, ఎలేషమ్మ, డివైఎఫ్ఐ నాయకులు నరేంద్ర, మాంటిస్సోరి స్కూల్ నిర్వాహకులు పిచ్చిరెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన సంక్రాంతి సంబరాలు

పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గద్దలగుంట గ్రామ అభివద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభకు ముఖ్యఅతిథిగా హాజరైన మాజీ మున్సిపల్ ఛైర్మన్ మంత్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 23 సంవత్సరాలుగా ఎంతో వైభవంగా సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్న గద్దలగుంట గ్రామాభివద్ధి కమిటీ నిర్వాహకులను అభినందించారు. ఆటపాటలతో పాటుగా చిన్నారులను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దాలని, సామాజిక సేవలో యువత ముం దుకు రావాలని ఆయన కోరారు. ఈ ప్రాంత అభివద్ధికి ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధనరావు ద్వారా తన వంతు సహకారం అందిస్తామన్నారు. కమిటీ గౌరవాధ్యక్షులు డాక్టర్ కొల్లా నాగేశ్వరరావు మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఉన్నతమైన విలువలతో కూడిన జీవన ప్రమాణాలను తల్లిదండ్రులు చిన్నారులకు నేర్పితే ఆశించిన మెరుగైన సమాజం చూడవచ్చన్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి ఆరిగ శ్రీనివాస్ మాట్లాడుతూ అధికార యంత్రాంగం, 120 మంది స్థానిక దాతల సహకారంతో గద్దలగుంట పార్క్, మహాప్రస్థానం, ఆరామ క్షేత్రం వంటివే కాకుండా ఇటీవల మహిళల సర్వతోముఖా భివృద్ధికి మహిళా భవన్ నిర్మించామన్నారు. తెలుగుదేశం పార్టీ 32వ డివిజన్ అధ్యక్షులు ఆరిగ శంకర్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న సమస్యలన్నింటిని ఎమ్మెల్యే దామచర్ల దృష్టికి తీసుకువెళ్లి వాటిని పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా రామ్ సాయి డాన్స్ అకాడమీ నృత్య ప్రదర్శన సభికులను ఎంతగానో ఆకట్టు కుంది. సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన 14 రకాల ఆటల పోటీల్లో గెలుపొందిన 100 మందికి మంత్రి శ్రీనివాసరావు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఆరిగ శైలజ, శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు కుర్రా ప్రసాద్ బాబు, రైజ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శాంతకుమారి, ఒంగోలు సిటిజన్ ఫోరమ్ అధ్యక్షులు కొల్లా మధు, ప్రముఖ న్యాయవాది చిట్టం శ్రీనివాసరావు,అ వయవ దాన ట్రస్ట్ మెంబర్ జి.నాగేశ్వరరావు, ఉమ్మడిశెట్టి శ్రీనివాసరావు గద్దలగుంట ప్రజలు పాల్గొన్నారు.



గద్దలగుంటలో బహుమతులు అందజేస్తున్న మంత్రి శ్రీనివాసరావు

వెలిగొండ ప్రాజెక్టును పూర్తిచేయండి

సిఎంను కలిసిన ఎంపీ మాగుంట, తనయుడు రాఘవరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా ప్రజల జీవనాడి వెలిగొండ ప్రాజెక్ట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కోరారు. బుధవారం ఉండవల్లిలోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రిని ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఆయన తనయుడు, యువ నాయకులు మాగుంట రాఘవరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబుకి మాగుంట రాఘవరెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి ఒంగోలులో విమానాశ్రయం నిర్మాణం, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని కోరారు. మార్కాపురం వైద్య కళాశాల పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి ఈ పనులు పూర్తి చేయటానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.



సిఎం చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న మాగుంట

పాకల తీరంలో సందడి

పండుగ నేపథ్యంలో తరలివచ్చిన జనం

ప్రజాశక్తి-శింగరాయకొండ

సంక్రాంతి సందర్భంగా శింగరాయకొండ మండలం పాకల సముద్ర తీరంలో జనంతో సందడి నెలకొంది. సంక్రాంతిలో భాగంగా బుధవారం నాడు కనుమ పండగ కావడంతో ఉదయం నుంచి జనం పాకల సముద్ర తీరానికి బయలుదేరారు. ఇప్పటికే సంక్రాంతి సందర్భంగా సొంత గ్రామాలకు వచ్చిన ఉద్యోగులు, వ్యాపారులు, వివిధ రకాల కార్మికులు ఇంటి దగ్గర సంక్రాంతి పండుగ చేసుకొని బుధవారం సాయంత్రం సమయంలో పాకల సముద్ర తీరానికి చిన్న, పెద్ద తేడా లేకుండా భారీగా చేరుకున్నారు. సముద్రంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. సంక్రాంతి పండుగ సందర్భంగా అక్కడ ఫోటోలు దిగుతూ, ఒకరినొకరు పలకరించుకుంటూ, గాలిపటాలను సైతం సముద్ర తీరంలోకి ఎగరవేస్తూ సంబరంగా గడిపారు. పాకల సముద్రతీరానికి సంక్రాంతి సందర్భంగా భారీగా జనం తరలిరావడంతో మెరైన్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. జనంతో సముద్ర తీరం కిటకిటలాడింది.





సముద్రం వద్ద సందడి చేస్తున్న జనం